
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 10 డిసెంబరు 2024

మద్యం.. నష్టం..!



వ్యాపారులపై నిర్వహణ భారం

ఇష్యూ ప్రైస్‌పై మార్జిన్ ఇవ్వడమే కారణం

ఇన్వాయిస్‌పై 20 శాతం ఇవ్వాలని డిమాండ్

మంత్రి, ఉన్నతాధికారులకు సంఘం నాయకుల వినతి

అనంతపురం అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు మద్యం షాపుల నిర్వహణ భారంగా మారింది. మద్యం వ్యాపారంలో బాగా లాభాలు వస్తాయన్న ఆశతో వ్యాపారులు టెండర్లు దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 20 శాతం మార్జిన్ వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు కట్టి మరీ లాటరీలో పాల్గొన్నారు. కొందరు వ్యాపారులు 5 నుంచి 50 దరఖాస్తులు వేశారు. దుకాణాలను దక్కించుకున్నవారు అక్టోబరు 16 నుంచి అమ్మకాలను ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించినట్లుగానే 20 శాతం మార్జిన్‌ను వర్తింపజేస్తూ జీవో జారీ చేసింది. కానీ మద్యం ఇష్యూ ప్రైస్‌పై మార్జిన్ ఇస్తుండటంతో నష్టపోతున్నామని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. టోటల్ ఇన్‌వాయిస్‌పై మార్జిన్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇష్యూ ప్రైస్‌పై మార్జిన్ ఇస్తున్నందున 9.5 శాతం మాత్రమే వస్తోందని వాపోతున్నారు.

ఇన్‌స్టాల్‌మెంట్‌కు ఇక్కట్లు

జిల్లా వ్యాప్తంగా 136 మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. ఈ ఏడాది అక్టోబరు 14న లాటరీ పద్ధతిలో టెండర్లు ఖరారు చేశారు. ఆరు విడతల్లో వ్యాపారులు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ చెల్లించాలని ప్రభుత్వం సూచించింది. రెండు నెలలకోమారు చెల్లించే రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను.. ఆ నెల ఆరంభానికి 10 రోజులు ముందుగానే చెల్లించాలని షరతు పెట్టింది. ఆలస్యమైతే 10 శాతం అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. పది వేల దాకా జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.50 లక్షలు, 10వేలపై నుంచి 50వేల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 50వేలపై నుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.65 లక్షలు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ చెల్లించాలని నిర్ణయించారు. అక్టోబరు, నవంబరు నెలలకు సంబంధించిన ఇన్‌స్టాల్‌మెంట్ అక్టోబరు 14న ముందస్తుగా చెల్లించారు. నవంబరు, డిసెంబరుకు గత నెల 20న రెండో ఇన్‌స్టాల్‌మెంట్ డబ్బులు చెల్లించారు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి జనవరి ఒకటో తేదీకి పది రోజుల ముందుగానే మూడో ఇన్‌స్టాల్ మెంట్ చెల్లించాల్సి ఉంది. లాభాలువస్తేనే ఇలా ముందస్తుగా చెల్లించడం సాధ్యమని వ్యాపారులు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో పలు మండలాల్లో వ్యాపారులు ఒక్కటయ్యారు. రోజువారీ వ్యాపారాన్ని కలిసి సమానంగా పంచుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయినా మార్జిన్ తక్కువగా వర్తింపజేస్తుండటంతో మద్యం వ్యాపారం కొనసాగించడం కష్టమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

తడిసి మోపెడు

జిల్లాలోని 136 మద్యం దుకాణాలకు 3,265 దరఖాస్తులు అందాయి. ఒక్కో దరఖాస్తుకు నాన్ రీఫండబుల్ ఫీజు రూ.2లక్షలు చెల్లించారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.65.30 కోట్లు చేరింది. మద్యం షాపు నిర్వహణ కోసం ప్రభుత్వానికి చెల్లించే రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌తోపాటు షాపు బాడుగ, అడ్వాన్స్‌లు, సేల్స్‌మెన్ వేతనాలు, మద్యం రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు పలు మున్సిపాలిటీల్లో షాపుల బాడుగలు పెంచారు. ఈ పరిస్థితుల్లో మార్జిన్ ను విషయంలో ప్రభుత్వం పునరాలోచించకపోతే మద్యం షాపులు నిర్వహించలేమని వారు అంటున్నారు.

నష్టానికి వ్యాపారం

అనంతపురంలోని ఓ మద్యం షాపులో రోజుకు రూ.2 లక్షల బిజినెస్ జరుగుతోంది. అంటే నెలకు రూ.60 లక్షలు . ప్రభుత్వం ఇచ్చే 9.5 శాతం మార్జిన్ ప్రకారం నెలకు రూ.5.70 లక్షలు మిగులుతుంది. రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ ఏడాదికి రూ.65 లక్షలు చెల్లించాలి. ఈ లెక్కన నెలకు రూ.5.41 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఒక్కో షాపులో ఒక సూపర్ వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్ ఉంటారు. సూపర్ వైజర్‌కు రూ.18వేలు, సెల్స్ మెన్‌కు రూ.15వేలు వేతనం ఇవ్వాలి. ఈ లెక్కన నలుగురు సిబ్బందికి రూ.63 వేలు చెల్లించాలి. డిపో నుంచి మద్యం షాపునకు రవాణాకు నెలకు రూ.50వేల నుంచి రూ.60వేలు, కరెంటు బిల్లు రూ.10వేలు, స్వీపర్‌కు రూ.3వేలు, స్టేషనరీకి రూ.5వేలు ఖర్చు అవుతోంది. ఈ లెక్కన నెలకు రూ.6.72 లక్షలు ఖర్చు అవుతుంది. షాపు నిర్వహణకు పెట్టుబడి రూ.40 లక్షలు దాకా పెట్టారు. ఇందు కోసం వడ్డీ మొత్తం రూ.80వేలు కట్టాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ లెక్కన నెలకు రూ.2 లక్షలపైగా నష్టం వస్తోందని మద్యం వ్యాపారులు వాపోతున్నారు.

తెలంగాణ తరహాలో ఇవ్వాలి..

తెలంగాణలో మద్యం ఇన్‌వాయిస్ ధర మొత్తానికి బ్రాండ్‌ను బట్టి మార్జిన్ వర్తింపజేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. ఏపీలో కేవలం ఇష్యూ ప్రైస్‌కు మాత్రమే మార్జిన్‌ను వర్తింపజేస్తున్నారు. మొత్తం మద్యం ధరతోపాటు ట్యాక్స్‌లు కలిసిన ఇన్‌వాయిస్ ధరకు మార్జిన్‌ను వర్తింపజేయడం లేదని, తద్వారా తాము తీవ్రంగా నష్టపోతున్నామని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. తెలంగాణ తరహాలో ఇన్‌వాయిస్ మొత్తానికి 20 శాతం మార్జిన్ ఇస్తారని ఆశపడ్డామని, తీరా షాపు ఏర్పాటు చేసి మద్యం కొనుగోలు చేసిన తర్వాత ఇష్యూ ప్రైస్‌కు మాత్రమే మార్జిన్ ఇస్తుండటంతో నష్టపోతున్నామని వాపోతున్నారు.

మంత్రి దృష్టికి..

ప్రైవేటు మద్యం వ్యాపారుల సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను, ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులను కలిసి అర్జీలు సమర్పించారు. ఇష్యూ ప్రైస్‌పై మార్జిన్ ఇస్తుండటంతో నష్టాలు వస్తున్నాయని, పూర్తి ఇన్‌వాయిస్‌కు మార్జిన్‌ను వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే కోర్టుకు వెళతామని సంఘం నాయకులు అంటున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుందో వేచిచూడాల్సిందే.

ఫ్రెండ్లీగా ఉండండి: కలెక్టర్



ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

అనంతపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'సీఎం చంద్రబాబు ఫ్రెండ్లీ గవర్నమెంట్ అంటున్నారు. ఆయన మనతో అలాగే వ్యవహరిస్తున్నారు. మనమూ ప్రజలు, ప్రజా ప్రతినిధులతో అలాగే వ్యవహరించాలి.' అని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లినేని వినూత్న, ఇన్‌చార్జి డీఆర్వో తిప్పేనాయక్, జేడీఏ ఉమామహేశ్వరమ్మ తదితరులతో కలిసి బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 485 మంది తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అర్జీలను అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలలో మార్పులు రావాలని అన్నారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజా ప్రతినిధులు, ప్రజలను గౌరవించాలని సూచించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి 4గంటల వరకు విజిటర్స్ అవర్ నిర్వహించాలని సూచించారు. విజిటర్స్, భోజన విరామ సమయాలలో విధిగా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఉద్యాన పంటలు, ప్రభుత్వ ప్రోత్సాకాలను తెలిపే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఓ అశోక్‌కుమార్, సీఈఓ వెంకటసుబ్బయ్య, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది..

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండల పరిధిలోని యాలేరు బస్టాప్ సమీపంలో సోమవారం రాత్రి కారు దగ్ధమైంది. పంపనూరు నుంచి రైతు మల్లిరెడ్డి వై.కొత్తపల్లికి వెళుతుండగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో మల్లిరెడ్డి వెంటనే కారును రోడ్డు పక్కన ఆపి, అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా కేంద్రం నుంచి అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ లింగమయ్య సిబ్బందితో వెళ్లి మంటలను ఆర్పేశారు. కారు పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది మదన్‌మోహన్‌రెడ్డి, పెంచలయ్య, అంకిరెడ్డి తదితరులు మంటలను ఆర్పేశారు.

నోటి దురుసు దుమారం

వైసీపీ టీచర్ అశోక్ వ్యవహారంపై పోలీసుల ఆరా

మరో టీచర్‌పై దాడికి యువకుల యత్నం

పెద్దగా పట్టించుకోని విద్యాశాఖ



ఈనెల 7న మెగా పీటీఎం సందర్భంగా టీచర్ అశోక్ కుమార్ రెడ్డిని ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులు

అనంతపురం విద్య, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ గురించి హేళనగా మాట్లాడిన వైఎస్ఆర్‌టీఏ నేత అశోక్‌కుమార్ రెడ్డి వ్యవహారం దుమారం రేపుతోంది. 'చికెన్, పొట్టేలు కోసి పెట్టాలా..?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనం విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు, విద్యాశాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. అనంతపురం రూరల్ మండలంలో తాటిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో కథనంరావడంతో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ పాఠశాల ఆవరణ గొడవగొడవగా మారింది. హెచ్ఎం రామ్‌కుమార్ ఉన్నఫలంగా సెలవు పెట్టారు. వివాదానికి కారణమైన టీచర్ అశోక్‌కుమార్ రెడ్డి ఆలస్యంగా విధులకు వచ్చారు. ఆ తరువాత కాసేపటికి రెడ్డి సామాజికవర్గానికి చెందిన కొందరు స్థానిక యువకులు అదే స్కూల్‌లో పనిచేసే మరో టీచర్‌పై దాడికి ప్రయత్నించారు. అశోక్ వ్యాఖ్యల గురించి ఆయన బయటకు సమాచారం ఇచ్చారన్న అనుమానంతో కొట్టేందుకు వెళ్లారు. విషయం తెలుసుకున్న అనంతపురం రూరల్ పోలీసులు అక్కడికి వెళ్లి విచారించారు. అశోక్ వ్యాఖ్యల గురించి స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన ఇద్దరు పోలీసులు విచారించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులతో వారు వాట్లాడి, వివరాలు సేకరించారు. గతంలో కొన్నేళ్లపాటు ఆయన అశోక్ విధులకు వెళ్లకుండా, వలంటీర్‌తో పాఠాలు చెప్పించడం, కూటమి ప్రభుత్వాన్ని కించపరిచేలా మాట్లాడటం, ఇతర అక్రమాల గురించి వారు వివరించినట్లు సమాచారం. అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని దూషించడం నిజమేనని విచారణాధికారులు నిర్ధారణకు వచ్చారని తెలిసింది.

48 గంటలు గడిచినా....

తాటిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 7వ తేదీన ఘర్షణ చోటు చేసుకుంది. మెగా పీటీఎంలో వాగ్వాదం జరిగింది. విద్యార్థులకు సరిగా అన్నం పెట్టలేదు. వైఎస్ఆర్‌టీఏ నాయకుడు అశోక్ కుమార్ రెడ్డి కూటమి ప్రభుత్వం గురించి ఇష్టారాజ్యంగా మాట్లాడారు. ఈ ఘటన జరిగి 48 గంటలు గడిచినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదు. డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులుగాని, ఇతర అధికారులుగాని ఆ వైపు కన్నెత్తి చూడలేదు. డీఈఓ ప్రసాద్‌బాబును సోమవారం రాత్రి ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, తాటిచెర్ల స్కూల్ ఘటనపై విచారణ చేయిస్తామని తెలిపారు. అది హైస్కూల్ కాబట్టి డిప్యూటీ డీఈఓతో విచారణ చేయిస్తామని చెప్పుకొచ్చారు.

జింకల నుంచి కాపాడండి

డీఎఫ్ఓకు రైతుల వినతి



డీఎఫ్ఓకు సమస్యలు చెప్పుకుంటున్న రైతులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) కృష్ణ జింకల దాడి నుంచి తమ పంటలను కాపాడాలని విడపనకల్లు మండల రైతులు డీఎఫ్ఓ విఘ్నేష్ అప్పాకు సోమవారం విన్నవించారు. పదేళ్ల నుంచి సమస్యను ఎదుర్కొంటున్నామని, అటవీశాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించలేదని వాపోయారు. అప్పట్లో వందల సంఖ్యలో ఉన్న జింకలు ప్రస్తుతం వేల సంఖ్యకు చేరాయని, పంట మొలక దశలోనే దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల రక్షణ కోసం కాపలాదారులను ఏర్పాటు చేసుకున్నామని, వన్యప్రాణులను భక్షించారన్న నెపంతో అటవీశాఖ అధికారులు వారిపై కేసులు పెడుతున్నారని అన్నారు. జింకలను వేరే ప్రాంతాలకు తరలించాలని కోరారు. అయితే, జింకల తరలింపు సాధ్యం కాదని, పంటల రక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని డీఎఫ్ఓ అన్నారు. ఆధారాలు లేకుండా కాపలాదారులపై కేసులు నమోదు చేయకుండా చూస్తామని అన్నారు.

సమగ్రశిక్షకు ఏపీసీ

జీతాల చెల్లింపునకు లైన్‌క్లియర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం విద్య, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష సిబ్బంది జీతాల కష్టాలపై కలెక్టర్ స్పందించారు. డీఈఓకు ఏపీసీగా బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జ్ ఏపీసీ నాగరాజు ఇటీవల బదిలీ అయ్యా రు. దీంతో ఫండ్స్ వచ్చినా బిల్లులు పెట్టేవారు లేరు. సుమారు 14 వందల పైచిలుకు ఉద్యోగులకు జీతాలు అందలేదు. ఈ సమస్యపై 'కలెక్టర్ సారూ.. జీతాలు ఇప్పించండి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్పందించి, డీఈఓ ప్రసాద్‌బాబుకు ఏపీసీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో జీతాల సమస్య తీరుతుందని ప్రాజెక్టు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాయల్టీని కాజేస్తున్న ముఠా

- ఒక్కో నకిలీ బిల్లుపై వేలల్లో ఆదాయం
- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న వైనం
- రాయలచెరువులో ఆగడాలు

యాడికి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో ఖనిజ రవాణాకు సంబంధించి రాయల్టీ నకిలీ బిల్లులు హల్‌చల్ చేస్తున్నాయి. గ్రామానికి చెందిన ఒక వ్యాపారి కంపెనీ పేరుతో రాయల్టీ నకిలీ బిల్లు బయటపడింది. ఆ వ్యాపారి దీన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. రాయల్టీకి సంబంధించిన నకిలీ బిల్లు మరొకటి పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామం వద్ద పట్టుబడినట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. రాయలచెరువు గ్రామానికి చెందిన కొందరు యువకులు ఒక ముఠాగా ఏర్పడి రాయల్టీ నకిలీ బిల్లులు సృష్టిస్తున్నట్లు మైనింగ్ యజమానులు ఆరోపిస్తున్నారు. రాయలచెరువు పరిసర ప్రాంతాల్లోని డోలమైట్, స్టీటైట్ ఖనిజాన్ని కర్ణాటక, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాలకు తరలిస్తుంటారు. ఖనిజాల తరలింపునకు టన్నుకు రూ.300 రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఒక లోడులో 30 టన్నుల నుంచి 40టన్నుల వరకు ఖనిజాన్ని తరలిస్తుంటారు. ఇందుకు సంబంధించి మైనింగ్ యజమానులు రాయల్టీ చెల్లించి తమమైనింగ్ కంపెనీ పేరుతో బిల్లులు ఇస్తారు. వీటిపై కన్నేసిన కొందరు యువకులు బిల్లులకు సంబంధించిన బుక్కులను అక్రమంగా సంపాదించుకొని ఖనిజాన్ని రవాణా చేసే వారితో కుమ్మక్కై తక్కువ ధరకు నకిలీ బిల్లులు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో రాయల్టీలు కట్టించుకొనే సంస్థతో పాటు, మైనింగ్ కంపెనీల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు.

రాయలచెరువులోనే నకిలీ బిల్లుల ముఠా

రాయల్టీకి సంబంధించిన నకిలీ బిల్లుల తయారీలో రాయలచెరువుకు చెందిన కొందరు ఆరితేరారని, వారే గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారాన్ని అంతా నడుపుతున్నట్లు చర్చించుకుంటున్నారు. ఒక్కొక్క నకిలీ బిల్లుపై రూ.ఆరువేల నుంచి 10వేల వరకు సొమ్ము చేసుకుంటూ కొత్త దందాకు తెరలేపినట్లు చర్చించుకుంటున్నారు. ఇలాంటి నకిలీ బిల్లులు నెలలో వందల సంఖ్యలో మార్పిడి చేస్తున్నట్లు సమాచారం. రాయల్టీ నకిలీ బిల్లుల వ్యవహారమంతా రాయలచెరువులోని ఒక కేఫ్ వద్ద జరుగుతున్నట్లు తెలిసింది. జల్సాలకు అలవాటుపడ్డ యువకులే ఈ తతంగమంతా నడిపిస్తున్నట్లు చర్చించుకుంటున్నారు. ఖనిజ రవాణాకు సంబంధించిన రాయల్టీ నకిలీ బిల్లులు తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రాయలచెరువులో శనివారం పట్టుబడిన రాయల్టీకి సంబంధించిన నకిలీ బిల్లు

మా దృష్టికి రాలేదు

దొంగ బిల్లుల వ్యవహారం మా దృష్టికి రాలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకే సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు అందజేస్తాం. దొంగ బిల్లుల వ్యవహారంతో ప్రభుత్వ ఆదాయానికి ఎటువంటి నష్టం ఉండదు. సంబంధిత కాంట్రాక్టర్ వీటిని చూసుకోవాల్సి ఉంటుంది. దొంగబిల్లులు వస్తున్నట్లు మా దృష్టికి వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

-ఓబులరెడ్డి, ఏడీఏ, గనులు, భూగర్భవనరుల శాఖ, తాడిపత్రి

మూడు ముక్కలాట..!



సాగవుతున్న మల్బరీ

- మూడు శాఖల మధ్య నలుగుతున్న వీఎస్ఏలు
- గతంలో ఎరువులు, విత్తనాల అమ్మకం పనులు
- మాతృశాఖలో విలీనం చేయాలని వేడుకోలు
- సమస్య పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్(వీఎస్ఏ)లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, సచివాలయ ఉద్యోగాల భర్తీలో భాగంగా వీఎస్ఏలను నియమించారు. ఇంటర్మీడియేట్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీల్లో సెరికల్చర్ చదివినవారిని అర్హులుగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నియామకం సందర్భంగా పట్టుపరిశ్రమ శాఖలో టెక్నికల్ ఉద్యోగమని చెప్పారు. అయితే వారిని మూడుశాఖలకు ముడిపెట్టారు. వీరి ఉద్యోగం పట్టు పరిశ్రమ శాఖలో.. పర్యవేక్షణ మాత్రం అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌ది. జీతాలు ఇచ్చేది పంచాయతీరాజ్ శాఖ. ఇలా మూడు ముక్కలాటల తమ ఉద్యోగం ఉందని పలువురు వీఎస్ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెరికల్చర్ పనులు కాకుండా అగ్రికల్చర్, హార్టికల్చర్ సంబంధిత పనులు చేయడం. ఏపీ ఎంఐపీ, మార్కెటింగ్ చేయించడం. క్రాప్‌బుకింగ్, విత్తనాలు, ఎరువులు అమ్మడం తదితర పనులకు గత ఐదేళ్లుగా పరిమితం

ఎరువుల అమ్మకానికి పీహెచ్‌డీనా..?

ఉమ్మడి జిల్లాలోని 150 వీఎస్ఏల్లో చాలామంది సెరికల్చర్ కోర్సుల్లో పీజీ, పీహెచ్‌డీలు చేశారు. విద్యాభ్యాసంలో భాగంగా మల్బరీ పంటపై అనేక ప్రాజెక్టులు చేశారు. సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతులు పాటిస్తే ఆరోగ్యకరమైన మల్బరీ ఆకును పండించవచ్చు. వీటిని ఆహారంగా తీసుకున్న పట్టు పురుగులు మేలురకమైన గూళ్లను ఉత్పత్తి చేస్తాయి. తద్వారా రైతులకు అధిక ఫలసాయం దక్కుతుంది. పంటసాగులో, పట్టుగూళ్ల ఉత్పత్తి సమయంలో వ్యాధుల నివారణకు అవసరమైన కొత్త సాంకేతిక పద్ధతులు అవలంబించాలి. చంద్రికల నుంచి పట్టుగూళ్లను వేరుచేసి మార్కెట్‌కు తరలించేవరకు కకూన్‌లు సహజసిద్ధమైన నాణ్యత కోల్పోకూడదు. ఇలాంటివాటిపై పరిశోధన చేసిన తమతో పట్టు రైతులకు ఉపయోగపడే పనులు కాకుండా ఐదేళ్ల నుంచి ఎరువులు, విత్తనాలు అమ్మిస్తున్నారని వీఎస్‌లు వాపోతున్నారు. వీటికోసం సెరికల్చర్‌లో పీజీలు, పీహెచ్‌డీలు చేయాలా? అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చేశారని పేర్కొన్నారు. వీఎస్ఏలుగా సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ ద్వారా పట్టు రైతులకు ఎలాంటి సేవలు అందించాలో సెరికల్చర్ ఆఫ్ కమిషనరేట్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేటాయించిన విధులు నిర్వహించేందుకే వీఎస్ఏల ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు 2019 జూలై 17న 631 జీఓను జారీ చేసింది. అయినా గత ప్రభుత్వం వాటిని విస్మరించిందని వాపోతున్నారు.

వీఎస్ఏలు నిర్వహించాల్సిన విధులు

- సెరికల్చర్ కార్యకలాపాలు చేపట్టేందుకు రైతులను గుర్తించడం.
- మట్టినమూనాలు సేకరించడం, భూసార పరీక్షల రికార్డులను నిర్వహించడం.
- మల్బరీ ప్లాంటేషన్ చేపట్టేందుకు రైతులకు సాంకేతిక మార్గదర్శకం చేయడం, అందుకు అవసరమైన పరికరాలను అమర్చడం.
- పట్టు పురుగుల పెంపకం షెడ్ల నిర్మాణానికి కావాల్సిన పెంపక పరికరాలను అందజేసి సూచనలు చేయడం.
- వ్యాధుల్లేని పట్టుపురుగు గుడ్ల సరఫరా కోసం రాష్ట్ర, కేంద్ర పట్టు పురుగు విత్తనోత్పత్తి కేంద్రాలు, గ్రెయినేజీలతో సమన్వయం చేసుకోవడం.
- రైతులకు పట్టుపురుగుల పెంపకం, కకూన్ మార్కెటింగ్ కోసం సాంకేతిక మార్గదర్శకత్వం చేయడం.
- మల్బరీ, సిల్క్‌వార్మ్ వ్యాధులు. ఇంటిగ్రేటెడ్ పెస్ట్‌మేనేజ్‌మెంట్ నివారణ, నియంత్రణపై అవగాహన కల్పించడం.
- మల్బరీ గార్డెన్ నిర్వహణలో సేంద్రియ, సహజ వ్యవసాయంపై అవగాహన కల్పించడం.
- రైతులకు మేలు చేసేలా ప్రభుత్వ పథకాలు అమలు చేయడం.
- సెరికల్చర్ యూనిట్లు తీసుకోవడానికి రైతులకు బ్యాంకు రుణాలను అందించడం.
- రైతుల డేటా డాక్యుమెంటేషన్‌ను నిర్వహించడం.
- శిక్షణలు, వర్క్‌షాపులు నిర్వహించడం. ఫీల్డ్ విజిట్‌లు చేసి తగిన సాంకేతిక సలహాలివ్వడం.
- సెరికల్చర్ ఆఫీసర్(ఎస్ఓ), అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్(ఏఎస్ఓ)ల పరిధిలో ఆయా మండలాల్లో సేవలందించడం.
- ఎస్ఓ, ఏఎస్ఓలకు కాలానుగుణ నివేదికలు సమర్పించాలి.
- ఎప్పటికప్పుడు ప్రభుత్వం అప్పగించిన అన్ని ఇతర పనులకు హాజరుకావాలి.

మూడుశాఖలు, ముప్పతిప్పలు

పట్టుపరిశ్రమ శాఖలో పనిచేసేందుకు నియమించిన వీఎస్ఏలు మూడుశాఖలకు అనుబంధంగా పనిచేస్తున్నారు. ఉద్యోగంలో చేరింది సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో అయితే పర్యవేక్షించేంది అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్. జీతాలు పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ నుంచి చెల్లిస్తున్నారు. ఇలా మూడు శాఖల మధ్య ముప్పతిప్పలు పడుతున్నామని వీఎస్ఏలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీఎస్ఏలు విధులకు హాజరయ్యే రైతు సేవాకేంద్రాలకు మండల అగ్రికల్చర్ ఆఫీసర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. సెలవు కావాలంటే పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలి. ఆయన అనుమతిస్తే లీవ్‌లెటర్ సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్తుంది. ఈ నేపథ్యంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మాతృశాఖ అయిన పట్టు పరిశ్రమ శాఖలో విలీనం చేస్తే ఎవరు, ఎప్పుడు, ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో సమాచారం ఉంటుంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటే ఉద్యోగాలు సక్రమంగా నిర్వహించేందుకు వీలుంటుందని వారు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని గత ప్రభుత్వంలో విన్నవించినా, లేఖలు అందజేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు.

సందిట్లో సడేమియా

మూడుశాఖల మధ్య ఎవరికి ఎవరో తెలియని పరిస్థితులను కొంతమంది వీఎస్ఏలో బాగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఫలానా పనులు చేయాలని పైఅధికారులు ఏదైనా చెబితే నాకు వేరేపని అప్పగించారు. అక్కడ ఉన్నానంటూ విధులకు డుమ్మా కొడుతున్నారన్న ఆరోపణలు తోటి వీఎస్ఏల నుంచే వినబడుతున్నాయి. సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ ఎస్ఓలు, ఏఎస్ఓలను సైతం బురిడీ కొట్టిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తున్నాయి. మండల అగ్రికల్చర్ ఆఫీసర్, ఎంపీడీఓ, పంచాయతీ సెక్రెటరీ ఇలా ఎవరు పని పురమాయించినా ఏదో ఒకశాఖ అధికారి పేరుచెబుతూ తప్పించుకుంటున్నారని అధికార వర్గాలు మండిపడుతున్నాయి.



జిల్లాకేంద్రంలోని పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయ ముఖద్వారం

మాతృశాఖలో విలీనం చేయాలి



ఉమ్మడి జిల్లాలోని 150మంది వీఎస్ఏలు సెరికల్చర్‌లో ప్రత్యేకమైన కోర్సులు చేసిన విద్యావంతులు. మాతృశాఖలో విలీనంచేస్తే.. మల్బరీ రైతులకు సాంకేతిక సలహాలు, సూచనలు అందించడానికి అవకాశం ఉంటుంది. పట్టుపరిశ్రమ, అగ్రికల్చర్, పంచాయతీరాజ్ మూడు శాఖలకు వీఎస్ఏల ఉద్యోగాన్ని ముడిపెట్టారు. వీఎస్ఏలను మాతృశాఖలో కలపాలని గత ప్రభుత్వంలో అనేకసార్లు వేడుకున్నాం. పట్టించుకోవపోవడంతో పోరాటాలు చేశాం. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం మడకశిరకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి విన్నవించడంతో సానుకూలంగా స్పందించారు. మరోసారి మంత్రి నారా లోకేశ్, సెరికల్చర్ కమిషనర్‌ను కలిసి వివరిస్తాం.

-డాక్టర్ అంజనరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం

ఎస్ఆర్‌లు మా శాఖలోనే..



వీఎస్ఏల సర్వీస్ రిజిస్టర్(ఎస్ఆర్)లు మాశాఖలోనే ఉన్నాయి. సాధారణ సెలవులు మినహా మెడికల్, మెటర్నటీ, మ్యారేజ్ వంటివాటికి ఎక్కువ రోజులు సెలవులు కావాలంటేనే అనుమతిచ్చే అధికారాలున్నాయి. వీఎస్ఏలను అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షిస్తుంటే, పంచాయతీరాజ్‌శాఖనుంచి జీతాలు ఇస్తున్నారు. విలీన అంశాన్ని రాష్ట్ర అధికారులు పరిశీలిస్తున్నారు. మా శాఖలో ప్రస్తుతమున్న అధికారులు, సిబ్బందితో మల్బరీసాగులో ప్రగతిని సాధిస్తున్నాము. వీఎస్ఏలు తోడైతే అవసరమైన ప్రాంతాల్లో విధులు కేటాయించవచ్చు.

-అంజనేయులు, పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి

సాయుధ దళాల నిధికి విరాళాలు ఇవ్వండి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



సైనిక్‌నిధికి విరాళం అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశరక్షణ కోసం నిరంతరం పోరాటం సాగిస్తూ ప్రాణత్యాగాలు చేస్తున్న సైనికుల కుటుంబాల సంరక్షణ కోసం సాయుధ దళాల నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరులైన వీరజవాన్ల కుటుంబాలను ఆదుకోవడానికి ఉదారంగా అన్నివర్గాల ప్రజలు విరాళాలు అందజేయాలని కోరారు. విరాళాలు సైనిక సంక్షేమం కోసం ఖర్చుపెడతారన్నారు. సహకారం అందించి, సైనికుల రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులందరూ తమవంతు సాయం చేశారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

రైల్వే సహాయ మంత్రికి ఎంపీ అంబికా వినతి

అనంతపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని రైల్వేశాఖ సహాయ మంత్రి (రైల్వే మినిస్టర్ ఆఫ్ స్టేట్) సోమన్నను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. పార్లమెంటులోని మంత్రి చాంబర్‌లో ఆయన్ను ఎంపీ సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతపురం, రాయదుర్గం, గుత్తి, హిందూపురం పట్టణాలకు సంబంధించి రైల్వే సమస్యలున్నట్లు వివరించారు. రాజధాని ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-బీదర్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ -లాతూర్ ఎక్స్‌ప్రెస్‌ల ను అనంతపురం మీదుగా నడపాలన్నారు. టాటానగర్ - యశ్వంత్ పూర్ ఎక్స్‌ప్రెస్, మైసూర్- వారణాసి ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-జైపూర్, తిరుపతి-దోడహల్లి ఎక్స్‌ప్రెస్‌లు రాయదుర్గం మీదుగా నడపాల న్నారు. సంపర్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, కంగు ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రాయల్ చెరువులో నిలిపేలా చూడాలన్నారు. వందే భారత్, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లను హిందూపురంలో నిలపాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారని విన్నవించారు. గుంతకల్లు అనంతపురం నగరాలలో వివిధ చోట్ల అండర్‌పాసులు నిర్మించాలని కోరారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం నుంచి యశ్వంత్‌పూర్ వరకు, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం నుంచి హిందూపురం వరకూ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం నుంచి అనంతపురం వరకు, హౌరా ఎక్స్‌ప్రెస్‌ను గుత్తి నుంచి గుంతకల్లు వరకూ కొనసాగించాలన్నారు. మైసూర్ టు జైపూర్ ఎక్స్‌ప్రెస్ వారానికి రెండు మూడు రోజులు నడపాలని, యశ్వంత్‌పూర్ టు జైపూర్ వారానికి మూడు రోజులు నడపాలని ఆయన మంత్రిని కోరారు. హిందూపురం-బెంగళూరు మెము ట్రైన్‌లో మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. తిరుపతి-కదిరి దేవరపల్లి రైలుని తిరిగి ప్రారంభించాలన్నారు. గుంతకల్లు-చిక్ జార్జూర్ రైలు రోజూ నడిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం అనంతపురం, హిందూపురం రైల్వేస్టేషన్లలో లిఫ్టులు ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైన రైల్వేస్టేషన్లలో కోచ్ డిస్‌ప్లే బోర్డులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు, మరుగుదొడ్లు, తాగునీరు, సిట్టింగ్ ఫెసిలిటీస్, క్యాంటిన్, లైట్లు, ప్లాట్‌ఫామ్, ఫస్ట్ ఎయిడ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైతే రైల్వేస్టేషన్లలో నిర్మాణాలు సరిగ్గాలేవో ఆ ప్రాంతాల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.



కేంద్ర మంత్రి సోమన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

నేడు పింఛన్ల పరిశీలన

- డీఆర్‌డీఏ-వెలుగు పీడీ, డీఎల్‌డీఓ పర్యవేక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పరిశీలన చేపట్టేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ పాలనలో దివ్యాంగులు, ఇతర కేటగిరీల్లో భారీగా అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తొలివిడతలో జిల్లాలో ఒక గ్రామ-వార్డు సచివాలయాన్ని ఎంపిక చేశారు. ఇందుకు తనిఖీలకు పక్క మండలానికి చెందిన అధికారులను నియమించారు. ఒక్కో తనిఖీ బృందం 40పింఛన్లు మాత్రమే పరిశీలిస్తుంది. ఆయా సచివాలయాల పరిధిలోని పింఛన్‌దారుల సంఖ్యను బట్టి ఎన్ని బృందాలు అవసరమో నిర్ణయిస్తారు. ఈ బృందం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తుంది. జిల్లాలో ఈ ప్రక్రియ మంగళవారం చేపట్టాలని సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

చియ్యేడు గ్రామంలో...

అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామంలోని గ్రామ సచివాలయంలో పింఛన్లను పరిశీలిస్తారు. డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, డీఎల్‌డీఓ లలితాబాయిల నేతృత్వంలోని 11బృందాలు పింఛన్ల తనిఖీ చేయనున్నారు. గ్రామంలో మొత్తం 425పింఛన్లు ఉన్నాయి. ఇందులో వృద్ధులు 250మంది, వితంతువులు63, దివ్యాంగులు 54, అభయహస్తం 32, సఫాయి కర్మచారులు 8మంది, చేనేతలు 7, ఒంటరి మహిళలు 6, డప్పు కళాకారులు 3, తలసేమియా 2 మొత్తం 425పింఛన్లు ఉన్నాయి. బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల నుంచి అధికారులు పరిశీలనలో పాల్గొననున్నారు. ప్రతి బృందంలో ఒక మండల అధికారి, ఒక గ్రామ సచివాలయ ఉద్యోగి ఉంటారు.

సీఎం హామీలన్నీ నెరవేర్చాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబునాయుడు నేమకల్లులో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కలెక్టర్ వినోద్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. సోమవారం సీఎంఇచ్చిన హామీలు, ఇప్పటివరకు అక్కడ కొనసాగుతున్న పనులతీరుపై కలెక్టర్.. అధికారులతో కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేమకల్లు సభలో సీఎం 27రకాల హామీలు ఇచ్చారన్నారు. ఆయా హామీల అమలుకు సంబంధితశాఖల అధికారులందరూ ప్రత్యేక దృష్టి పెట్టి కృషి చేయాలన్నారు. బొమ్మనహాళ్ మండలంలో బీసీ రెసిడెన్షియల్‌పాఠశాలఏర్పాటుకు స్థలసేకరణ చేపట్టి డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించారు. 12మందికి ఇళ్లు మంజూరు చేయాలని, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన అభివృద్ధి పనులకు 24గంటలలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, సీపీఓ అశోక్‌కుమార్, డీపీఓ, హౌసింగ్ పీడీ, పీఆర్ఎస్ఈ, విద్యుత్‌ఎస్ఈ, డ్వామాపీడీ పాల్గొన్నారు.

15న అండర్-12 బాలుర జట్టు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అండర్-12 బాలుర జట్టు ఎంపిక పోటీలు ఈనెల 15న అనంత క్రీడా గ్రామంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి తెలిపారు. 2012 సెప్టెంబరు 1వతేదీ నుంచి 2015 ఆగస్టు 31లోపు జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రికెట్ కిట్, యూనిఫాంతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7702889365 నంబరులో సంప్రదించాలని కోరారు.

భారీగా గోవా మద్యం పట్టివేత

- 474 బాక్సులు స్వాధీనం
- మొత్తం విలువ రూ.44 లక్షలు
- నలుగురు నిందితుల అరెస్టు
- ప్రధాన నిందితుడు 'బూసుపల్లి' పరారీ

అనంతపురం అర్బన్/ రాప్తాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ స్థాయిలో అక్రమంగా నిల్వ ఉంచిన గోవా మద్యాన్ని అనంతపురం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోవా మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి, విక్రయిస్తున్న అనంతపురానికి చెందిన నలుగురు నిందితులు అబుసలేహ, దస్తగిరి హుసేన్, కిశోర్, వాచ్‌మెన్ ఆనంద్‌లను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు అనంతపురానికి చెందిన బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. రాప్తాడు మండలం రైల్వే గేటు సమీపంలోని ఓ తోటలోని రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన ఏపీ ధరల మేరకు రూ.44 లక్షల విలువైన 474 బాక్సుల గోవా మద్యాన్ని అనంతపురం ఎక్సైజ్ పోలీసులు సోమవారం సాయంత్రం సీజ్ చేశారు. ప్రధాన నిందితుడు వెంకటశివకుమార్‌రెడ్డి గతంలో పొలంలోని రేకుల షెడ్‌ను లీజుకు తీసుకొని గొర్రెల యూనిట్‌ను పెట్టినట్లు తెలిసింది. ఆ తర్వాత గొర్రెల యూనిట్‌ను పక్కన పెట్టి, అదే రేకుల షెడ్‌లో గోవా నుంచి తెచ్చిన అక్రమ మద్యాన్ని నిల్వ చేసి, మరో నలుగురి సహకారంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం.

సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా గుర్తించిన పోలీసులు

బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి, మరికొందరు గోవా నుంచి అక్రమంగా మద్యం బాటిళ్లు జిల్లాకు తీసుకొచ్చి, విక్రస్తున్నారని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామికి రెండు రోజుల క్రితం సమాచారం అందింది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీరామ్, సీఐలు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్ల బృందాలుగా విడిపోయి ప్రధాన నిందితుడు, ఇతర నిందితుల కోసం గాలించారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ప్రధాన నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు అనంతపురం నగరంలోని పలు ప్రాంతాల్లో కారులో తిరిగినట్లు సమాచారం. ఇదే క్రమంలో తాను అక్రమంగా నిల్వ ఉంచిన రేకుల షెడ్ వద్దకు అతను వెళ్లినట్లు సమాచారం. సెల్ సిగ్నల్ ఆధారంగా సోమవారం సాయంత్రం రేకుల షెడ్ వద్దకు వెళ్లిన ఎక్సైజ్ అధికారులకు అక్కడ మద్యం ఖాళీ అట్టపెట్టెలు ఉండటంతో రేకుల షెడ్‌లోకి వెళ్లి చూశారు. అక్కడ భారీగా గోవా మద్యం బాటిళ్లు ఉండటాన్ని గమనించారు. అక్రమంగా నిల్వ ఉంచిన గోవా మద్యాన్ని సీజ్ చేశారు.



రేకుల షెడ్డులో నిల్వ ఉంచిన గోవా మద్యం



మీడియాతో మాట్లాడుతున్న ఎక్సైజ్ పోలీసులు

ప్రధాన నిందితుడు పరారీ



గోవా అక్రమ మద్యం నిల్వ, విక్రయంలో ప్రధాన నిందితుడు అనంతపురానికి చెందిన బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి పరారీలో ఉన్నాడు. అతడితో కలిసి అక్రమ మద్యం నిల్వ, విక్రయించిన నలుగురు నిందితులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురానికి చెందిన అబుసలేహ, దస్తగిరి హుసేన్, కిశోర్, వాచ్‌మన్ ఆనంద్‌ను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడికోసం గాలింపును ముమ్మరం చేశారు. గోవా అక్రమ మద్యాన్ని చాకచక్యంగా పట్టుకున్న అధికారులు, సిబ్బందిని డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అభినందించారు. ఈ దాడుల్లో అనంతపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎక్సైజ్ ఎస్ఐ జాకీర్ హుస్సేన్, అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు లక్ష్మీసుహాసిని, సునంద, అన్నపూర్ణ అలిబేగ్ ఎస్ఐలు సత్యనారాయణ, హరికృష్ణ, హెచ్‌సీలు, కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మానవహక్కుల వేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహాసభల బ్రోచర్లను ఆవిష్కరించారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఈనెల 14, 15వ తేదీల్లో జిల్లాకేంద్రంలో సాయినగర్‌లోని యాపిల్ ఫంక్షన్ హాల్‌లో మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కులగణన ఎందుకు అవసరం అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు, 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై స్వతంత్ర విలేకరి మాలిని సుబ్రహ్మణ్యం, కాషాయీకరణ, కార్పొరేటీకరణ అనే అంశాలపై చరిత్ర విశ్రాంత అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తిలు హాజరై ప్రసంగిస్తారన్నారు.



మహాసభల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కలకలం

- సెంట్రల్ వర్సిటీ హాస్టల్ వద్ద తచ్చాడిన దుండగులు
- విద్యార్థినుల కేకలతో పరారైన వైనం
- పోలీసుల అదుపులో నలుగురు అనుమానితులు
- నిందితులను గుర్తించే పనిలో పోలీసులు

బుక్కరాయసముద్రం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంతులూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ వసతిగృహంలో అమ్మాయిల భద్రతపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యం 40 మందికి పైగా సెక్యూరిటీ సిబ్బంది పహారా ఉన్న లేడీస్ హాస్టల్ ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తులు తచ్చాడినట్లు సమాచారం. అప్రమత్తమైన ఓ విద్యార్థిని గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పరారైనట్లు సమాచారం. తీవ్ర కలకలం రేపిన ఈ సంఘటన ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో జరిగినట్లు సమాచారం. విద్యార్థినులు వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించా రు. పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లేలోపు ఆ దుండగులు అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది.

అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో 900పైగా విద్యార్థులు క్యాంపస్‌లో అభ్యసిస్తున్నారు. ఇందులో 400 మందికిపైగా లేడీస్ హాస్టల్లో ఉంటున్నారు. వర్సిటీలో ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం బిహార్ నుంచి కూలీలు వచ్చారు. వారు క్యాంపస్‌లోనే తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. అయితే ఆదివారం రాత్రి పొద్దుపోయాక హాస్టల్ ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు తచ్చాడటంతో ఓ విద్యార్థి గమనించి గట్టిగా కేకలు వేసినట్లు తెలిసింది. విద్యార్థుల సమాచారంతో పోలీసులు క్యాంపస్‌లోకి వచ్చేసరికి దుండగలు పరారీ అయినట్లు సమాచారం. దీనిపై పోలీసు బ్లూ క్లోట్స్ పోలీసు సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు కరుణాకర్, కౌలుట్లయ్య, ఇటుకలపల్లి సీఐ హేమంత్ పోలీసు సిబ్బంది సంఘటనకు స్థలానికి చేరుకున్నారు. నిందితులు కోసం గాలింపు చర్యలు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. అనంతరం సోమవారం ఉదయం జిల్లా కేంద్రం నుంచి డాగ్ స్క్వాడ్‌ను ద్వారా గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. కాగా ఈ ఘటనకు సంబంధించి పోలీసులు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆరోపణలు వ్యాపించడంతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వర్సిటీని సందర్శించారు.



సెంట్రల్ యూనివర్సిటీలో నూతనంగా నిర్మించిన లేడీస్ హాస్టల్

ఆరోపణలే..

అనంతపురం సెంట్రల్ వర్సిటీ బాలికల వసతి గృహం ప్రాంగణంలో పురుషులు తచ్చాడారనే ఆరోపణల్లో వాస్తవంలేదు. భవనం ఇరువైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఆరోపణలపై సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా ఎక్కడా అలాంటి దృశ్యాలు కనిపించలేదు. పోలీసు బృందం కూడా ఫుటేజ్‌లను పరిశీలించింది. ఇలాంటి దుశ్చర్యలకు చోటులేకుండా వర్సిటీలోని అన్ని విభాగాల్లో సీసీ కెమెరాలు అమర్చాము. 24 గంటలు సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. వర్సిటీలోకి వచ్చేపోయే ప్రతిఒక్కరి వివరాలు నమోదు అవుతున్నాయి.

- ప్రొఫెసర్ ఎస్ఏ కోరీ, వీసీ, సెంట్రల్ యూనివర్సిటీ

● ఎగసిపడ్డ గంగమ్మ





చందనలో బోరుబావి వేస్తున్న సమయంలో ఉప్పొంగిన గంగ



యాడికి మండలం చందన సమీపంలోని ఓ పొలంలో బోరు వేస్తుండగా.. పక్కనే ఉన్న మరో బోరు నుంచి భూగర్భ జలం రాకెట్ వేగంతో పైకి దూసుకొచ్చింది. సుమారు యాభై అరభై అడుగుల ఎత్తు ఎగసిపడింది. ఆ ప్రదేశంలో.. కేవలం ఎకరం విస్తీర్ణంలో 80కి పైగా వ్యవసాయ బోరుబావులు ఉన్నాయి. సాగునీరు అవసరమైన రైతులు అక్కడ కాస్త స్థలం కొని.. బోరుబావులు వేయించుకుంటున్నారు. అక్కడి నుంచి తమ పొలాలకు పైప్‌లైన్ వేసుకున్నారు. చందనకు చెందిన నలుగురు రైతులు ఉమ్మడిగా సోమవారం ఒక బోరుబావిని తవ్వించారు. తవ్వకం జరుగుతున్న సమయంలో పక్కనే మూతవేసి ఉన్న బోరుబావి నుంచి ఒక్కసారిగా నీరు ఎగసిపడింది. బోరువేసే క్రమంలో ఒత్తిడి కారణంగా ఇలా జరిగినట్లు భావిస్తున్నారు. కొత్త బోరు తవ్వకం పూర్తయిన కాసేపటికి నీరు ఎగసిపడటం ఆగిపోయింది.

- ఆంధ్రజ్యోతి, యాడికి

మీ మేలు మరువలేనయ్యా..!

కలెక్టర్‌కు వృద్ధురాలి కృతజ్ఞత



కలెక్టర్‌కు కృతజ్ఞత తెలుపుతున్న రామాంజినమ్మ

అనంతపురం టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' సక్రమంగా పనిచేస్తే.. బాధితులు అధికారులను ఎంతగా గౌరవిస్తారో తెలిపే ఘటన ఇది. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వచ్చిన రామాంజినమ్మ అనే వృద్ధురాలు 'మీ మేలు మరువలేనయ్యా..' అంటూ కలెక్టర్‌కు రెండు చేతులెత్తి నమస్కరించారు. ఏళ్ల తరబడి ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తు చేసుకుని, కంటతడి పెట్టుకున్నారు. రామాంజినమ్మ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం గేటువద్ద నివాసం ఉన్నారు. ఆమెకు గుంతకల్లులోని సర్వే నంబరు348-సీలో 35 సెంట్ల స్థలం ఉంది. కొన్నేళ్ల క్రితం కొన్న ఆ స్థలం డబుల్ రిజిస్ట్రేషన్ అయింది. అధికారులను ఎన్నిసార్లు కలిసినా న్యాయం జరగలేదు. ఈ నేపథ్యంలో గత నెలలో గుంతకల్లులో కలెక్టర్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. రామాంజినమ్మ అక్కడే కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి, తమ సమస్యను వివరించారు. స్థలం అమ్మిన వ్యక్తిని పిలిపించి న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ఆమె స్థలం ఆమెకు దక్కేలా చేశారు. దీంతో రామాంజినమ్మ తన కుమారుడితో కలిసి వచ్చి కలెక్టర్‌కు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ అదే శాలువాతో ఆమెను సత్కరించారు.

మనసున్న మారాజులు

ఆకలి తీర్చుతున్న దాతృత్వం
విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం
ధర్మవరం బాలికల కళాశాలలో 13 ఏళ్లుగా నిర్వహణ

ధర్మవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నం ఆకలితో అలమటించే విద్యార్థినులకు అన్నదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ధర్మవరం పట్టణానికి చెందిన కొందరు దాతలు. గ్రామీణ ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థినులు మధ్యాహ్నం పూట మంచి నీళ్ల తాగి కడుపు నింపుకునే వాళ్లు. ఈ విషయాన్ని గమనించిన దాతలు రోజూ మధ్యాహ్నం వారికి అన్నదానం చేస్తూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 450 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. వీరిలో చాలా మంది గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తారు. ఉదయాన్నే కళాశాలకు రావాల్సి ఉండడంతో ఆ సమయానికి ఇళ్లలో భోజనం సిద్ధంకాదు. దీంతో మధ్యాహ్నం భోజనం లేక అలమటించేవారు. దీనిని గమనించిన కళాశాల కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్, అప్పటి ప్రిన్సిపాల్ నాగలింగం భోజన అమలుకు శ్రీకారం చుట్టారు. బండి వేణుగోపాల్ తన స్నేహితుడైన చట్టా వెంకటనారాయణను సంప్రదించి విద్యార్థినుల పరిస్థితి వివరించారు. తన వంతు సాయం అందిస్తానని ఆయన ముందుకు వచ్చారు. దీంతో 2012లో మధ్యాహ్న భోజన పథకాన్ని 108 మంది విద్యార్థినులతో ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ పథకం దాతల సహకారంతో కొనసాగుతూనే ఉంది. 2013లో 158 మంది, 2014లో 180మంది, 2015లో 200 మంది, 2016, 2017, 2018 సంవత్సరాల్లో 300-350, ఈ ఏడాది 450 మంది విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్నారు.



మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న దాత, కళాశాల చైర్మన్ బండి వేణుగోపాల్

రుణపడి ఉంటాం..



కళాశాలలో మధ్యాహ్న భోజనం పెడుతుండడంతో ఆకలి తీరుతోంది. ఇంటి నుంచి కళాశాలకు వచ్చే మాకు ఉచితంగా భోజనం అందించడం వల్ల చదువుపై మరింత దృష్టి సారిస్తున్నాం. కళాశాలలో సాయంత్రం వరకు ఉండి చదువుకుంటున్నాం. ఇందుకు సహకరించిన దాతలకు రుణపడి ఉంటాం.

-మహేశ్వరి, కనుముక్కల

ఎంతో మేలు..



చదువుకునేందుకు గ్రామాల నుంచి వస్తున్నాం. కళాశాలలో భోజనం పెట్టడం మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. నాణ్యమైన భోజనం పెడుతున్నారు. ఆకు కూరలతో చేసిన కూరలను వడ్డిస్తున్నారు. కళాశాలలో మధ్యాహ్న భోజనం కడుపు నింపుతోంది.

-పూజిత, చిన్నూరు, బత్తలపల్లి

సంతృప్తినిస్తోంది..



విద్యార్థినులకు భోజనం అందించడం నాకెంతో సంతృప్తిగా ఉంది. నేను 2012లో మధ్యాహ్న సమయంలో కళాశాలకు వచ్చినప్పుడు విద్యార్థినులు ఇళ్లకు వెళ్లడం గమనించాను. మరికొందరు నీళ్లతాగి కడుపునింపుకోవడం పరిశీలించాను. దీంతో మా మిత్రుల సహకారంతో ఉచిత భోజనం అందించేందుకు సిద్ధపడ్డాను. ఎందరో దాతల సహకారంతో విద్యార్థినులకు భోజనం అందిస్తున్నాం.

- బండి వేణుగోపాల్, కళాశాల చైర్మన్, దాత

పులిపిరికి అరుదైన చికిత్స

8 ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

అనంతపురం జిల్లా, డిసెంబరు 9: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. అనంతపురం జిల్లాలోని, కీర్తిరెసిడెన్సీ, కమలానగర్, ఈఇఖిఅరోడ్, అనంతపురం నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈనెల 9, 10, 11 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. మంగళ, బుధశ రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

స్టోర్ డీలర్ ఆత్మహత్యాయత్నం

టీడీపీ నాయకులు కుటుంబంలో చిచ్చుపెట్టారని ఆరోపణ

తన భూమిని అమ్మనివ్వడంలేదని ఆవేదన.. మంత్రి సవితకు సెల్ఫీ వీడియో సందేశం



వీల్‌చైర్‌లో శ్రీధర్

గోరంట్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇద్దరు టీడీపీ నాయకులు తన తండ్రికి లేనిపోనివి చెప్పి భూవివాదాన్ని సృష్టించారని ఆరోపిస్తూ ఓ స్టోర్‌డీలర్ ఆత్మహత్యకు యత్నించాడు. తాను చనిపోతున్నాననీ, తన బిడ్డలకు ఆస్తి దక్కేలా చూడాలని మంత్రి సవితను కోరుతూ సెల్ఫీ వీడియో తీసుకుని, పురుగుల మందు తాగాడు. బాధితుడి పరిస్థితి విషమంగా మారడంతో బెంగళూరుకు తరలించారు. మండలంలోని మల్లాపల్లికి చెందిన శ్రీధర్.. సోమవారం పురుగుల మందు తాగాడు. నాలుగెకరాల పొలంపై తనకు అన్ని హక్కులు ఉన్నా.. సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందని సెల్ఫీ వీడియోలో శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశాడు. అందుకే పొలాన్ని రూ.2.36 కోట్లకు విక్రయించి అగ్రిమెంటు చేసుకున్నాననీ, రూ.80 లక్షలు అడ్వాన్సు చెల్లించారని తెలిపాడు. మరో రూ.1.56 కోట్లు అందాల్సి ఉండగా, స్థానిక టీడీపీ నాయకులు ఇద్దరు తన తండ్రి దశరథరామప్పకు తనపై లేనిపోనివి చెప్పారనీ, తనకు వివాహేతర సంబంధం అంటగట్టారని వాపోయాడు. తన తండ్రి మనసు మార్చి, తన భూమి రిజిస్ట్రేషన్‌ను అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు బతకాలని లేదనీ, తాను చనిపోయాక రూ.1.56 కోట్ల మొత్తాన్ని తన కుమారుడు బాలాజీకి చెందేలా చూడాలని మీడియాను అభ్యర్థించాడు. రాజకీయ స్వార్థంతో తన తండ్రి బుద్ధిపాడుచేసి, తన భూమిని టీడీపీ నాయకులు వెంకటరెడ్డి, మహమ్మద్ కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. 'సవితమ్మ అక్కా.. మీ పేరు చెప్పుకుని అమాయకులను మోసం చేస్తున్నారు. ఇలాంటివారిని దూరం పెడితే పార్టీకి మంచి పేరు వస్తుంది. నేను టీడీపీకోసం ఎంతో చేశా. దయచేసి నన్ను క్షమించండి' అని మంత్రి సవితకు విన్నవించాడు. ఆ తరువాత మల్లాపల్లిలోని తన నివాసంలో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హిందూపురం, అక్కడి నుంచి బెంగళూరు తరలించారు.

విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నాడు..

శ్రీధర్ సెల్ఫీ వీడియో, ఆత్మహత్యాయత్నంపై గోరంట్ల సీఐ శేఖర్ స్పందించారు. శ్రీధర్‌కు చెందిన నాలుగెకరాల పొలాన్ని తాకట్టుపెట్టి, విచ్చలవిడిగా ఖర్చు చేశాడన్నారు. దీంతో తండ్రి దశరథరామప్ప మనవళ్లకు ఫీజులు కడుతూ చదివిస్తున్నారనీ, తాకట్టు పెట్టిన భూమిని విడిపించి, తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. మరొకరికి అగ్రిమెంటు చేయించాలని శ్రీధర్ బోగస్ పత్రాలు సృష్టించడంతో న్యాయం కోసం కొన్నిరోజులుగా దశరథరామప్ప పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడని తెలిపారు.

పోలీస్ స్టేషన్ నుంచి పరారీ

అనంతపురం క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి దొంగతనం కేసు నిందితులు ఇద్దరు పరారయ్యారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కళ్యాణదుర్గం, అనంతపురం నగర శివారులోని పలు ఆలయాలు, ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. దీంతోపాటు బైక్‌ల దొంతనాలు జరిగాయి. ఈ కేసులలో ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విచారణ నిమిత్తం ఇటీవల నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు సమాచారం. అదే రోజు తెల్లవారుజామున, పోలీస్ సిబ్బంది తక్కువగా ఉన్న సమయంలో షేక్ మహబూబ్ బాషా, గుజ్జల అశోక్ పరారయ్యారు. చోరీ సొత్తు రికవరీ కోసం ప్రయత్నిస్తున్న పోలీసులకు ఇద్దరి పరారీతో షాక్ తగిలింది. ఈ వ్యవహారంపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది. పారిపోయినవారిలో ఒకరిని పట్టుకున్నామని చెబుతున్నా.. స్పష్టత రాలేదని తెలిసింది.

టమోటా కిలో రూ.20



అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.10, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.37 వేలు



అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37,280 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 74 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఆరుగురిపై పిచ్చికుక్క దాడి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతమసీదువీధి, పాత పోస్టాఫీసు వీధిలో సోమవారం పిచ్చికుక్క ఆరుగురిపై దాడి చేసి గాయపర్చింది. వారిలో వై. గంగాద్రి, తుమ్మల ఫాతిమా, నాగరాజు, నారాయణ, నాగేంద్ర తదితరులు ఉన్నారు. వారు స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. గ్రామస్థులు ఏకమై ఆ పిచ్చికుక్కను చంపివేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మండల కేంద్రంలో పందులు, కుక్కలు భారీగా ఉన్నాయని, వాటిని నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరవకొండలో చోరీ

ఉరవకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీవీవీ నగర్‌లో నివాసం ఉంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ రిటైర్డ్ ఉద్యోగి సత్యనారాయణ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సత్యనారాయణ ఇంటికి తాళాలు వేసి నెల రోజుల క్రితం హైదరాబాద్‌లోని కుమారుల వద్దకు వెళ్లారు. దీనిని గమనించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలను పగలగొట్టి లోపలి చొరబడి, 30 తులాలు వెండి వస్తువులు, నగదును ఎత్తుకెళ్లారు. బీరువాలోని బట్టలను చెల్లా చెదురుగా పడేసి వెళ్లిపోయారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి తాళాలు ధ్వంసమై ఉండడాన్ని గమనించిన స్థానికులు బాధిత కుటుంబానికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి చెందిన శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

935 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 935 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎ స్-2కు 895 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

చేద్దామా.. వద్దా..?

పనులు చేస్తే బిల్లులు వస్తాయో.. రావో..

గత అనుభవాలతో తటపటాయిస్తున్న కాంట్రాక్టర్లు
పనులు చేయడానికి ముందుకురాని వైనం
రెండు నెలలైనా 10శాతం పనులే
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి

అనంతపురం సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాపాలు నేడు శాపాలుగా మారాయి. వైసీపీ ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు నేడు టెండర్ పిలిచినా ముందుకు రాని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో అధ్వానంగా మారిన ఆర్‌అండ్‌బీ రోడ్లను కూటమి ప్రభుత్వం బాగు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలోనే ఉమ్మడి జిల్లాలో రోడ్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్సు కోసం ఈ ఏడాది సెప్టెంబరులో రూ.44.29 కోట్లను మంజూరు చేసింది. అయితే రెండు నెలలు గడిచినా కనీసం 10శాతం పనులు కూడా జరగలేదు. ఇందుకు ప్రధాన కారణం గత ప్రభుత్వం మాదిరే ఇప్పుడు కూడా పనులు చేస్తే బిల్లులు రావేమోననే భయంతో కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని సమాచారం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 150 కోట్లు బిల్లులను గత సర్కార్ పెండింగ్ పెట్టినట్లు తెలిసింది.



ధర్మవరం డివిజన్‌లో రోడ్డు మరమ్మతు పనులు





తాడిపత్రి నుంచి బుక్కాపురం వెళ్లే రహదారి.. మరమ్మతులకు ముందు.. మరమ్మతుల తరువాత..

● వైసీపీ హయాంలో ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్..

ఉమ్మడి జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఆర్ అండ్‌బీలోని స్టేట్ హైవేలు, మేజర్ డిస్ట్రిక్ రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదు. అరకొరగా నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకుంది. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారు రూ. 150 కోట్లు బిల్లులు పెండింగ్‌లోనే పెట్టినట్లు సమాచారం. ఏళ్ల తరబడి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. అందుకే కూటమి సర్కార్ నిధులు మంజూరు చేసినా పనులు చేయడానికి ముందుకురాని దుస్థితి.

● ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇలా..

● అనంతపురం జిల్లాలో...
- రోడ్ల పనుల సంఖ్య : 134
- కిలోమీటర్లు : 1939.12
- వెచ్చించిన నిధులు: రూ. 27.76 కోట్లు

● శ్రీ సత్యసాయి జిల్లాలో..
- రోడ్ల పనుల సంఖ్య : 119
- కిలోమీటర్లు : 1499.24
- వెచ్చించిన నిధులు: రూ.16.53 కోట్లు



కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో..

రెండు నెలలైనా 10శాతం మాత్రమే...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.44.29 కోట్లతో 253 పనులు చేయనున్నారు. ఇందులో భాగంగా 3438.36 కిలోమీటర్ల చొప్పున రోడ్ల మరమ్మతులు, జంగిల్ క్లియరెన్సు పనులు చేసేందుకు కూటమి సర్కార్ ఈ ఏడాది సెప్టెంబరులో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కానీ గత సర్కార్ బిల్లులు చెల్లింపు ప్రక్రియను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వంలో కూడా కాంట్రాక్టర్లు పనులు వేగంగా చేయడం లేదు. చాలా మంది టెండర్లు దాఖలు చేశారు, కానీ.. పనులు చేయడంపై శ్రద్ధ వహించడం లేదు. కొందరు మాత్రం ధైర్యంగా చకచక పనులు చేశారు. గత రెండు నెలల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10శాతం మాత్రమే పనులు చేసినట్లు ఆశాఖ వర్గాల ద్వారా తెలిసింది. ఈ రెండు నెలల్లో చేసిన 10 శాతం పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు వస్తే వెంటనే మిగిలిన కాంట్రాక్టర్లు పనులు చేయాలనే యోచనలో ఉన్నట్లు ఆ వర్గాల నుంచి తెలిసింది.





● నెమ్మదిగా సాగుతున్న మాట వాస్తవమే

చాలా మంది కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వ పాలనలో చేసిన పనులకు బిల్లులు రాలేదు. దీంతో చాలామంది పనులు చేయాలంటే భయపడుతున్నారు. పనులు కూడా నెమ్మదిగానే సాగుతున్నాయి. పెండింగ్ బిల్లుల విషయం ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుత పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తాయని చెప్పి ఎక్కడికక్కడ అప్రమత్తం చేస్తున్నాం. దీంతో కొన్ని చోట్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. భవిష్యత్‌లో వేగవంతంగా జరిగే విధంగా చూస్తాం.

-హరిప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి ఎస్ఈ

బాలిక అదృశ్యం

దర్యాప్తులో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ తల్లి ఆత్మహత్యాయత్నం
పోలీసు స్టేషన్ ముందు బంధువుల ఆందోళన
ఒంటిపై పెట్రోల్ పోసుకున్న తండ్రి



బాధితులకు సర్దిచెబుతున్న సీఐ

మడకశిర టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధి బేగార్లపల్లికి చెందిన బాలిక కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న ఆవేదనతో తల్లి శైలజ సోమవారం ఆత్మహత్యకు యత్నించింది. ఇంట్లోనే ఆమె విషద్రావకం తాగింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆమెను మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బాలిక బంధువులు స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. ఆ సమయంలో బాలిక తండ్రి జయరామప్ప ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకునేందుకు యత్నించాడు. పోలీసులు అడ్డుకుని, సర్దిచెప్పారు. బాలిక ఆచూకీ త్వరలోనే గుర్తిస్తామని సీఐ రాజ్‌కుమార్ హామీ ఇవ్వడంతో వారు శాంతించి, వెళ్లిపోయారు.

లైంగికదాడి కేసులో వ్యక్తి అరెస్టు

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు రూరల్ సీఐ సురేష్ తెలిపారు. మండలంలోని బత్తలపల్లికి చెదిన ఈడిగ సూర్యనారాయణ మూడు రోజుల క్రితం ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. రెండు రోజుల క్రితం కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడి కోసం గాలించారు. సోమవారం మధ్యాహ్నం బత్తలపల్లి మారెమ్మ దేవాలయం సమీపంలో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఇందులో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సీఐ సురేష్, ఎస్ఐలు లింగన్న, కృష్ణమూర్తి, హెడ్‌కానిస్టేబుల్ రహంతుల్లా, కానిస్టేబుళ్ల రమేష్‌బాబు, రాందాస్‌నాయక్, భర ద్వాజ్‌రెడ్డిని అభినందించి, రివార్డులను అందచేస్తున్నట్లు ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

సంక్షిప్తం

16 నుంచి ధనుర్మాస వ్రతం

అనంతపురం కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో తపోవనంలోని శ్రీక్షేత్రంలో ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస వ్రత మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో సోమవారం ఉత్సవాల బ్రోచర్లను ఆలయ కార్యవర్గం ఆవిష్కరించారు. జనవరి 13న ఉత్సవాల ముగింపు సందర్భంగా గోదా రంగనాథస్వామి తిరుకల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి రఘునాథ్, పీటీ శేషాచార్యులు, రాళ్లపల్లి లక్ష్మణ్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ముచ్చుకోట ఫారెస్ట్ తనిఖీ

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముచ్చుకోట రిజర్వ్ ఫారెస్ట్‌ను జిల్లా అటవీశాఖ అధికారి విఘ్నేష్ అప్పా తనిఖీ చేశారు. సంబంధిత రేంజర్ మధుబాబుతో కలిసి సోమవారం పలు బౌండరీలను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో అక్రమణలకు గురైనట్లు గుర్తించారు. వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి బౌండరీలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించినట్లు డీఎఫ్‌ఓ తెలిపారు. అటవీ స్థలాల్లో అక్రమ మైనింగ్‌కు పాల్పడినా, అటవీస్థలాలను అక్రమించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

వాటర్ ప్లాంట్‌లో విజిలెన్స్ తనిఖీలు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నీటి శుద్ధి ప్లాంట్లలో విజిలెన్స్ అధికారులు సోమవారం అకస్మిక తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్ ఆధ్వర్యంలో డీఎస్పీ నాగభూషణం, సీఐ జమాల్‌బాషా పాల్గొన్నారు. అందులో భాగంగా అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లిలో ఉన్న నందిని మినరల్ వాటర్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. తగిన అనుమతులు లేకుండానే వాటర్ ప్లాంటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటి తో పాటు పలు లోపాలు ఎక్కువగా ఉండటంతో ప్లాంటును సీజ్ చేసినట్లు తెలిపారు. ఎనాలిసిస్ రిపోర్ట్ తర్వాత తగిన చర్యలు చేపడతామని విజిలెన్స్ ఎస్పీ తెలిపారు. ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ విజయలక్ష్మి, ఏఈఈ రాజశేఖర్, ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీం, లీగల్ మెట్రాలజీ అధికారి మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నాయక్‌నగర్‌కు చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నట్టు టూటౌన్ ఎస్‌ఐ రుష్యేంద్రబాబు తెలిపారు. నాయక్‌నగర్‌లో రాజేష్‌కుమార్, అనిత(36) దంపతులు నివాసముంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. రాజేష్‌కుమార్ ఓ ప్రభుత్వ డాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అనిత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. సోమవారం మధ్యాహ్నం సమయంలో తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతురాలి తల్లిదండ్రులు వచ్చిన తరువాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నగర శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. టీవీ టవర్ సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అనంతపురం నుంచి వెళ్తున్న కారు యూటర్న్ తీసుకుంటుండగా...అదే సమయంలో ఆకుతోటపల్లికి చెందిన అనిల్ అనే యువకుడు,అతని సోదరుడు గణేష్ వస్తున్న బైక్ కారును ఢీకొంది. ఈ ఘటనలో అనిల్, గణేష్‌కు గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనుంపల్లి వద్ద మరొకరికి...

గార్లదిన్నె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కనుంపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మధు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. విజయవాడకు చెందిన మధు కొంతకాలం నుంచి అనంతపురంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తుండేవాడు. సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో పామిడి వైపు వెళుతుండగా వెనుకవైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. మధుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

మట్కా బీటర్ అరెస్టు

గార్లదిన్నె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లూరులో ఓ మట్కా బీటర్ సోమవారం చికెన్ సెంటర్‌లో మట్కా రాస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.5వేలు నగదుతోపాటు మట్కా చీటిలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదానీ అక్రమాలపై విచారణ చేయాలి: సీపీఐ

రాప్తాడు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): అదానీ అక్రమాలపై వెంటనే విచారణ జరపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ దేశవ్యాప్త పిలుపు మేరకు రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం రాప్తాడులో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో అదానీ అవినీతి కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అధిక దరలు అరికట్టాలని, నిరుద్యోగం నిర్మూలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరేష్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పితే... అంతే సంగతులు..!

- ప్రమాదకరంగా యర్రగుంట్ల బ్రిడ్జి
- సైడ్‌వాల్‌లు లేని వైనం
- భయంభయంగా వెళ్తున్న ప్రయాణికులు


సైడ్‌వాల్ కూలిపోయి ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

గార్లదిన్నె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే మండలంలోని పలు రహదారులు ప్రయాణికుల పట్ల ప్రమాదకరంగా మారాయి. సైడ్‌వాల్‌లు లేని బ్రిడ్జిల వద్ద వాహనచోదకులు ఏ మాత్రం ఆదమరిచినా అంతే సంగతులు. ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అలాంటి బ్రిడ్జిల వద్ద ప్రమాదకరంగా ఉందని తెలిసినా తప్పని పరిస్థితుల్లో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. అయితే ఇటు అధికారులు...అటు పాలకులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గార్లదిన్నె మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జి ఇలా ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జికి సైడ్‌వాల్‌లు కొన్నేళ్ల క్రితమే కూలిపోయాయి. వాటిని తిరిగి నిర్మించడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు గానీ, పాలకులుగానీ పట్టించుకోలేదు. పెనకచెర్ల డ్యాం, పెనకచెర్ల, కొత్తపల్లి, కొప్పలకొండ, కమలాపురం, కొట్టాలపల్లి తదితర గ్రామాల నుంచి ఆటోలు, బస్సులు, ద్విచక్ర వాహనాల్లో నిత్యం వందలాది మంది వివిధ పనుల నిమిత్తం గార్లదిన్నె, అనంతపురానికి ఆ బ్రిడ్జి పైనే ప్రయాణం సాగిస్తారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జికి సైడ్ వాల్స్ నిర్మించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఎవరూ స్పందించలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు...అధికారులు స్పందించి బ్రిడ్జికి సైడ్ వాల్‌లు నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదం జరిగితేగానీ చలనం రాదా..?



బ్రిడ్జికి సైడ్ వాల్ లేక ఏళ్లు గడుస్తోంది. ఆ బ్రిడ్జిపై నిత్యం వంద లాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే అంతే సంగతి. గతంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలు కోకొల్లలు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎంపీఆర్ డ్యాంకు ఆ బ్రిడ్జిపైనే వెళ్లాలి. ఏ ఒక్కరూ సైడ్ వాల్‌లేని బ్రిడ్జి గురించి పట్టించుకోలేదు. ప్రమాదం జరిగితే అధికారులు, పాలకులు హడావుడి చేస్తారే తప్ప ముందస్తు చర్యలు చేపట్టరు. ఇప్పటికైనా యర్రగుంట్ల బ్రిడ్జికి సైడ్ వాల్ నిర్మించాలి

- శ్రీనాథ్‌చౌదరి, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి

తక్షణం చర్యలు చేపట్టాలి



మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే దారుల్లో ప్రమాద ప్రాంతాలు చాలా ఉన్నాయి. మలుపుల వద్ద కంపచెట్లు ఏపుగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. వాహనాలు ఎదురెదురుగా వస్తే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులకు ప్రమాద స్థలాలు గుర్తుకు వస్తాయి. ముందస్తు చర్యలు చేపట్టాలి.

- అక్బర్, జిల్లా ఉపాధ్యక్షుడు, వ్యవసాయ కార్మిక సంఘం

గ్రామాల్లో అభివృద్ధిపై ప్రజల హర్షం

- ఎమ్మెల్యే పరిటాల సునీత


సెల్ఫీ ద్వారా సీసీరోడ్డును చూపుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోందని, ఆర్నెల్లలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్క్ కనిపిస్తోందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆమె సోమవారం మండలపరిధిలోని కుంటిమద్ది గ్రామంలో రూ. 36.50 లక్షల వ్యయంతో ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించిన సీసీరోడ్లను స్థానిక టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామంలో రోడ్ల సమస్యలు పరిష్కరించి నందుకు గ్రామస్థులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీపడేది లేదని, మీకు ఎక్కడైనా నాణ్యతలేదని అనిపిస్తే అక్కడే ప్రశ్నించవచ్చని ఆమె ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యేవెంట టీడీపీ మండల ప్రధానకార్యదర్శి మారుతీప్రసాద్, తెలుగుయువత మండల అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు, మాజీ సర్పంచ్ నల్లప్ప, ఆనంద్, రఘురాం తదితరులు ఉన్నారు.

దుష్ప్రచారాన్ని యాప్ ద్వారా తిప్పికొట్టండి

అనంతపురం అర్బన్: ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని టీడీపీ యాప్ ద్వారా తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. టీడీపీ యాప్‌లో పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పతకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వారిలో 14 మంది క్రియాశీలక సభ్యులకు పార్టీ అధిష్ఠానం ప్రశంసా పత్రాలు పంపింది. వాటిని సోమవారం నగరంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి అందించి, అభినందించారు. కూటమి ప్రభుత్వంపై విషప్రచారాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ వాస్తవాలను ప్రజల్లోకి ఎప్పటికప్పుడు తీసుకువెళ్లాలన్నారు.

పంటకోత యంత్రాల పంపిణీ

రాప్తాడు నియోజకవర్గానికి చెందిన పలువురు రైతులకు పంట కోత యంత్రాలను ఎమ్మెల్యే పరిటాల సునీత పంపిణీ చేశారు. సోమవారం స్థానిక తన క్యాంపు కార్యాలయం వద్ద ఆరుగురు రైతులకు పంట కోత యంత్రాల మంజూరు పత్రాలను అందజేశారు. వారు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. పంటకోత యంత్రం పూర్తి ధర రూ.5.70 లక్షలు కాగా ఇందులో ప్రభుత్వం రూ.2 లక్షలు సబ్సిడీ వర్తింపజేసిందని తెలిపారు. అనంతపురం ఏడీఏ రవి, ఏఓ శశికళ, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

బార్ కౌన్సిల్ డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరించి అందజేస్తున్న న్యాయాధికారి

అనంతపురం క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనంతపురం బార్ కౌన్సిల్ నూతన డైరీని జిల్లా కోర్టు న్యాయాధికారి శ్రీనివాస్ ఆవిష్కరించారు. బార్‌కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు రామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం న్యాయాధికారి చాంబర్‌లో 2025 సంవత్సరం డైరీని ఆవిష్కరించారు. న్యాయాధికారి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై డైరీని ఆవిష్కరించారు. తొలి డైరీని బార్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్‌కు అందజేశారు. న్యాయవాదులు నరసింహులు, విశ్వనాథరెడ్డి, శేషారెడ్డి, రాము, పెద్దన్న, విజయ,వహిద, శ్రీవాణి, ఉమ, హేమంతి తదితరులు పాల్గొన్నారు.

అహుడా చైర్మన్‌కు సన్మానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌ను సోమవారం స్థానిక రామ్‌నగర్ కార్యాలయంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రాయల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, మెమెంటో అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. టీసీ వరుణ్‌కు అహుడా చైర్మన్ పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చంద్రబాబు, రమణ, గణేష్, చిన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో క్రైస్తవులకు పెద్దపీట

- టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో మాత్రమే ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో క్రైస్తవుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ పేర్కొన్నారు. జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం స్థానిక ఏజీ చర్చిలో ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. స్వామిదాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్ సమావేశంలోనే క్రైస్తవ మైనార్టీల సంక్షేమం కోసం నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి క్రిస్టియన్ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి క్రైస్తవులకు ద్రోహం చేశాడని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ క్రైస్తవ మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారన్నారు. జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు యేషయా, పాస్టర్లు అనీల్, డేనియల్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు పెరిగిన వేతనాలు

అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెరిగాయి. దీంతో సోమవారం పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లాను కలసి కృతజ్ఞతలు తెలిపారు. కొన్ని నెలలుగా వేతనాలు పెంచాలని కార్మికులు పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నాలు చేశారు. ఈ నేపథ్యంలో గతంలో పనిచేసిన కార్యదర్శితో కార్మిక నాయకులు వాగ్వాదం చేశారు. దీంతో కార్మికులకు సంబంధించిన వేతనాలు పెరుగకుండా అడ్డంకులు సృష్టించారని నాయకులు అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన సెలవులో వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే గ్రేడ్-1 పంచా యతీ కార్యదర్శి హిదయతుల్లాను నియమించారు. ఆయన చొరవతో కార్మికుల వేతనాలు పెంచేందుకు జిల్లా పంచాయతీ అధికారి నుంచి అనుమతులు లభించాయి. ఒక్కొక్కరికి రూ.1000చొప్పున పెరిగింది. ఈనెల నుంచి అందుకున్నారు.

'కామారుపల్లి వద్ద డంపింగ్ యార్డు వద్దు'

అనంతపురం రూరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కామారుపల్లి సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులు ఇబ్బందులు పడతారని టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నకు వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాములాయి రఘు, తెలుగురైతు నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణస్వామి, గ్రామస్థులు పాల్గొన్నారు. రైతులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డును ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దని కోరారు.

వడ్డీ వ్యాపారుల దౌర్జన్యాలను అరికట్టాలి

అనంతపురం క్రైం,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేదల అవసరాన్ని అవకాశంగా తీసుకొని అధికవడ్డీలకు రుణాలిస్తూ వడ్డీ వ్యాపారులు చేస్తున్న దౌర్జన్యాలను అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధితులతో కలిసి ఎస్పీ జగదీష్‌ను కలిసి విన్నవించారు. నగరంలో వడ్డీ వ్యాపారుల అరాచకాలకు అడ్డులేకుండా పోతోందన్నారు. కార్యక్రమంలో సాకే చిరంజీవి, రామకృష్ణ, వెంకటేష్, గోపాల్, బాధితులు నాగేశ్వరి, లక్ష్మిదేవి, ఆదెమ్మ, మల్లేశ్వరి, నాగరాజు, బాబు పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపండి: ఎస్పీ

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన పిటిషన్లకు ప్రాధాన్యత వారీగా పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశించారు. సోమవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 110 పిటిషన్లు వచ్చాయి. కార్యక్రమంలో ఏఎస్పీ రమణమూర్తి, మహిళా డీఎస్పీ మహబూబ్‌బాషా, ఎస్బీ సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్లపైనే వినతులు

అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు రైతుల నుంచి వినతులు వెల్లువెత్తాయి. సోమవారం జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం మీటింగ్ హాల్‌లో అనంతపురం డివిజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సు, అదాలత్ కార్యక్రమాన్ని చేపట్టారు. డివిజన్ ఈఈ జేవీ రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి చైర్ పర్సన్ (విశ్రాంత జిల్లా న్యాయాధికారి) వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఎస్ఈ సంపత్‌కుమార్ హాజరయ్యారు. సమస్యలను వినతుల రూపంలో తీసుకున్నారు. 17 ఫిర్యాదులు అందాయి. ఇందులో ఎక్కువ శాతం వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన ఉండటం గమనార్హం. నార్పల, పామిడి, గార్లదిన్నె, బెలుగుప్ప, కళ్యాణదుర్గం, బుక్కరాయసముద్రం, అనంతపురం, రాయదుర్గం, గాండ్లపర్తి ప్రాంతాల నుంచి ఫిర్యాదులు అందాయి. ఈకార్యక్రమంలో ఏఓ రాజశేఖర్, డీఈఈ శ్రీనివాసులు, చంద్రశేఖర్, ఏఈఈలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగలపై నిఘా ఉంచండి: ఎస్ఈ

ట్రాన్స్‌ఫార్మర్ దొంగలపై నిఘా ఉంచాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ విజిలెన్స్ సీఐ విశ్వనాథచౌదరితో కలసి విద్యుత్‌శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలపై చర్చించారు. దొంగతనాలు జరుగుతున్న ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బందితో నిఘా ఉంచాలన్నారు. అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్, ఈటి ప్రసాద్, కమర్షియల్ డీఈఈ రామకృష్ణ, శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అంగట్లో సరుకులా విద్యాసంస్థలు : పీఎస్ఎఫ్ఐ



ర్యాలీ చేస్తున్న పీఎస్ఎఫ్ఐ నాయకులు

అనంతపురం విద్య, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశంలో విద్య విజ్ఞానాన్ని అందించే విద్యాసంస్థలు అమ్ముడు సరుకుగా మారాయని పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఆలం పేర్కొన్నారు. డబ్బున్నోళ్లకే నాణ్యమైన విద్య అందుతోందని తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని సోమవారం మొదటిరోజు ర్యాలీ చేశారు. అనంతరం వీకేభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఆలం మాట్లాడుతూ... సమాజంలో అసమానతలు తగ్గాలంటే.. విద్యాసంస్థలను ప్రభుత్వాలు మాత్రమే నడపాలన్నారు. ఆనాడే... అందరికీ ఒకే తరహా విద్య అందుతుందని, సమానత్వం జరుగుతందన్నారు. కేంద్రం విద్యను ప్రైవేటీకరణ, కాషాయీకరణ చేస్తోందని, ఈ విధానాలకు స్వస్తి పలకాలన్నారు. సమావేశానికి హాజరైన ఆర్ట్స్ కాలేజ్ పూర్వపు ప్రిన్సిపాల్ రంగస్వామి, సామాజిక వేత్త అనిల్‌కుమార్ మాట్లాడుతూ... విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేయాలన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్‌సీపీఐ నాయకులు సంతోష్, నాగన్న నాగమణి, ప్రసన్నకుమార్, ఇతర నేతలు ప్రతిభ భారతి, మనోజ్‌కుమార్, జీవన్‌కుమార్, అవీన్‌బాబు, రవికుమార్, అనిల్‌కుమార్, చంద్రహాశి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కార్మికుల ధర్నా

అనంతపురం క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నగరపాలికలో సోమవారం ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ... మున్సిపల్, ఇంజనీరింగ్ కార్మికులకు రూ. 21 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగర జనాభా పెరిగిన నేపథ్యంలో కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. అనేక సమస్యల నడుమ కార్మికులు పనిచేస్తున్నారని, కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, కోశాధికారి వేణుగోపాల్, శివకృష్ణ, నాగేంద్రబాబు, రామాంజినేయులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు విరాళాలు


ఎమ్మెల్యేకి విరాళం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి


విరాళం అందజేస్తున్న సాకే రామాంజినేయులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గంలో పేదల సభ్యత్వ నమోదు కోసం పలువురు విరాళాలు అందించారు. అనంతపురంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో సోమవా రం మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి రూ.లక్ష, 9వ డివిజన్ నాయకుడు సాకే రామాంజినేయులు రూ.50 వేలను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు అందజేశారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు. కొన్ని డివిజన్లల్లో ఇంకా సభ్యత్వ నమోదు తక్కువగా ఉందని, ఆయా ప్రాంతాల్లో నాయకులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారామ్, సరిపూటి రమణ, కడియాల కొండన్న, నెట్టెం బాలకృష్ణ, నాగభూషణం, కృష్ణమోహన్‌నాయుడు, రాజప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, కంఠాదేవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు : ఎమ్మెల్యే

పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఆయన సోమవారం స్థానిక హమాలీ కాలనీలోని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ ఇంటికి వెళ్లారు. పలు అంశాలపై ఆయనతో చర్చించారు. గత ఐదేళ్లల్లో కీలకంగా పనిచేసిన నాయకులను విస్మరించే ప్రసక్తే లేదన్నారు. టీడీపీ బెస్త సాధికార సమతి రాష్ట్ర కమిటీ సభ్యుడు చేపల హరి ఆధ్వర్యంలో సోమ వారం స్థానిక లక్ష్మీనగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి పడి పూజకు ఎమ్మెల్యే హాజరై, పూజలు చేశారు.

రెవెన్యూ సదస్సులో స్వల్ప మార్పులు

అనంతపురం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగే గ్రామ రెవెన్యూ సదస్సుల్లో స్వల్ప మార్పులు చేపట్టినట్లు తహసీల్దార్ మోహన్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కామారుపల్లి, మధ్యాహ్నం రెండుగంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పాపంపేట, 11న ఉదయం మన్నీల, మధ్యాహ్నం చియ్యేడు, 17న ఉదయం తాటిచెర్ల, మధ్యాహ్నం సోములదొడ్డిలో సదస్సులు ఉంటాయన్నారు. అలాగే 18న ఆలమూరు, 19న ఉప్పరపల్లి, 20న కొడిమి, 21న కక్కలపల్లి, 26న కురుగుంట, 27న రాచానపల్లి, 28న ఉదయం సజ్జలకాలువ, మధ్యాహ్నం గొల్లపల్లి, 31న జంగాలపల్లి, జనవరి 2న కందుకూరు, 3న ఇటుకలపల్లిలో సదస్సులు ఉంటాయన్నారు. ప్రజలు మార్పులను గమనించాలన్నారు. అర్బన్ పరిధిలో మంగళవారం రాజీవ్‌కాలనీ పంచాయతీలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీ ల్దార్ తెలిపారు. 17న ఎ.నారాయణపురం, 19న నాగిరెడ్డిపల్లి, 21న రుద్రం పేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మెరుగైన సేవలందించాలి: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ


అర్బన్ హెల్త్ సెంటర్‌లో మందుల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పేదప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వైద్య సిబ్బందికి సూచించారు. పసుపుల ఫుడ్స్ చైర్మన్ పసుపుల శ్రీరామిరెడ్డి మండల కేంద్రంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో గర్భిణులకు ఏర్పాటు చేసిన భోజన వసతిని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ లోని సౌకర్యాలను, మందులను, రికార్డులను తనిఖీ చేశారు. రోగలకు వైద్యం అందించే విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్వాతి, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ సాల్మాన్, ఎంపీపీ సునీత, టీడీపీ జిల్లా సీనియర్ నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, హనుమంతరెడ్డి, కేశన్న, రవీంద్ర, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఏఐవైఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి'

అనంతపురం విద్య, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాయదుర్గంలో జరిగే ఏఐవైఎఫ్ 20వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని సీపీ ఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో జాఫర్ మాట్లాడారు. దేశంలో యువత ఉద్యోగావకాశాలు లేక నిత్యం 40 నుంచి 45 మంది వరకూ ఆత్మహత్య చేసుకుంటున్నారని, నేషనల్ క్రైం బ్యూరో లెక్కలు చెబుతున్నాయన్నారు. ఇప్పటికైనా నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. వచ్చేనెల 7న రాయదుర్గంలో జరిగే ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ రా్ష్ట నాయకులు శ్రీరాములు, జిల్లాప్రధానకార్యదర్శి సంతోష్, జిల్లా అధ్యక్షులు ఆనంద, నగర అధ్యక్షులు శ్రీనివాసులు, ఇతర నాయకులు మోహన్‌కృష్ణ, దేవ,సీపీఐ నేతలు అల్లిపీరా, గాదిలింగప్ప, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నగర కమిటీ ఎన్నిక

అనంతపురం కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మొత్తం 27 మందితో సీపీఎం నగర నూతన కమిటీ ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో నిర్వహిస్తున్న సీపీఎం నగర ఎనిమిదో మహాసభల్లో భాగంగా సోమవారం నగర కమిటీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. నగర కమిటీ కార్యదర్శిగా రామిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఆర్‌వీ నాయుడు, వెంకటనారాయణ, గోపాల్, ముర్తుజా, వలి, ప్రకాష్, మసూద్, ఇర్ఫాన్‌ను ఎన్నుకున్నారు. అలాగే నగర కమిటీ సభ్యులుగా ఓబులేసు, లక్ష్మీనరసమ్మ, ఏటీఎం నాగరాజు, వెంకటేష్, ఎన్టీఆర్ శీనా, ప్రసాద్, జీవ, ఇర్ఫాన్, బుల్లే రాజు, రామాంజినమ్మ, బాలకృష్ణ, బాబు, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, గఫూర్, ఆదినారాయణ, వెంకటనారాయణ, లతీఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం ప్రజాసమస్యలపై సమీక్షించి, భవిష్యత్ పోరాటాల కార్యాచరణను నిర్దేశించుకుంది.

రూరల్ క్రికెట్ లీగ్‌లో రికార్డు భాగస్వామ్యం


211 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన నిత్యారెడ్డి, హుసనారా

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రూరల్ క్రికెట్ లీగ్ పోటీల్లో వారు రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్తంగా సోమవారం స్థానిక అనంత క్రీడా మైదానంలో రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించారు. అండర్-15 బాలుర పోటీల్లో ఎస్ఎస్‌బీఎన్, పీటీసీ జట్లు తలపడగా....ఎస్ఎస్‌బీఎన్ జట్టు 24.3 ఓవర్లలో 78పరుగులకు ఆలౌట్ అయింది. పీటీసీ బౌలర్ రోహిత్ 5వికెట్లు, హేమంత్‌సాగర్, వెంకట్‌సాయి చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం బరిలోకి దిగిన పీటీసీ జట్టు 13 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 80 పరుగులు చేసింది. దీంతో పీటీసీ జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. అండర్-16 బాలికల పోటీల్లో కదిరి, తపోవనం క్రికెట్ అకాడమీ జట్లు తలపడగా... టీసీఏ 30 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసింది. హిమవర్షిణి 99 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కదిరి జట్టు 23.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 211 పరుగులు చేసి విజయం సాధించింది. ఓపెనర్లు నిత్యారెడ్డి 211పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. జట్టుకు 10వికెట్ల తేడాతో విజయాన్ని అందించారు.

క్లుప్తంగా..

నెట్టికంటి ఆలయంలో మన్యుసూక్త హోమం


పుష్పాలంకరణలో ఆంజనేయుడి ఉత్సవమూర్తి

గుంతకల్లు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూర్వాభాద్రా నక్షత్ర సంక్రమణాన్ని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం మన్యుసూక్త హోమంను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు దేవస్థానంలోని యాగశాలలో ఆంజనేయ స్వామి వారి ఉత్సవ విగ్రహానికి తిరుమంజన స్నపనం నిర్వహించి అలంకరణలు చేశారు. అనంతరం మన్యుసూక్త హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈఓ వాణి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) :మండలంలోని టీ కొత్తపల్లి గ్రామశివారులోని బొగ్గుల బట్టీ వద్ద సోమవారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నెల్లూరు జిల్లా పాములురాయి గ్రామానికి చెందిన సుబ్బమ్మ, శ్రీనివాసులు దంపతులు. వారు కొత్తపల్లి వద్ద బొగ్గుల బట్టీలో పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. కాగా సుబ్బమ్మ కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది బంధువులు గుర్తించి వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోండి

రాయదుర్గంటౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న రోడ్డును ఆక్రమించుకుని ఇంటిని నిర్మించుకున్న వైసీపీ అధికార ప్రతినిధి మాధవరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు తిప్పేస్వామి, శంకర్, లోకేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. గాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల కుడి భాగాన గల రోడ్డును వైసీపీ అధికార ప్రతినిధి కబ్జాచేసి అక్రమంగా ఇంటిని నిర్మించుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో అక్రమ నిర్మాణంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 100 అడుగుల మేర రోడ్డు దురాక్రమణకు గురైనప్పటికీ ఏమాత్రం పట్టించుకోలేదని పేర్కొన్నారు. రోడ్డును ఆక్రమించడంతో పాటు గాంధీపాఠశాల ప్రహరీ స్థలాన్ని కబ్జా చేసిన మాధవరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రైతుల మధ్య దారి చిచ్చు

యల్లనూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలాపురం గ్రామంలో రైతుల మధ్య రహదారి చిచ్చు ఏర్పడింది. సర్వేనెంబరు 42లో గత 40సంవత్సరాల నుంచి రహదారి ఉంది. అయితే ఈ పొలంలో రహదారి లేదంటూ గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి దున్నివేయడంతో ఆ రహదారిపై వెళ్లే రైతులు అక్కడికి వచ్చి అడ్డగించారు. రీసర్వే జరిగిన సమయంలో సర్వే అధికారులు ఈ రహదారి మరోచోట ఉన్నట్లు తెలిపారని అందుకే దున్నివేశానని రైతు లక్ష్మీనారాయణరెడ్డి తెలియజేశాడు. దీనిపై మిగిలిన రైతులు తహశీల్దార్ కార్యాలయంకు వెళ్లి తహశీల్దార్‌కు రాజాకు విన్నవించారు. త్వరలోనే రహదారిని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

తల్లీకొడుకుపై దాడి

తాడిపత్రి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇగుడూరు గ్రామంలో తల్లీకొడుకుపై సోమవారం నలుగురు వ్యక్తులు దాడిచేశారనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఇగుడూరు గ్రామానికి చెందిన అనిల్ కుమార్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా అదే గ్రామానికి చెందిన రమణయ్య, నాగేంద్ర, విశ్వనాథ్, రామాంజనేయులు బాడుగకు ఆటో పిలవగా అనిల్ కుమార్ వెళ్లలేదు. ఇందుకు ఆగ్రహించిన వారు అనిల్ ఇంటివద్దకు వెళ్లి అతడిపై, అతడి తల్లిపై దాడిచేసి గాయపరిచారు. స్థానికులు ఆ ఇద్దరినీ చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

కాలుష్యం నుంచి కాపాడండి

డీ.హీరేహాళ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామం ఇరువైపులా ఏర్పాటు చేసిన ఐరన్ ఓవర్ ఇతర కర్మాగారాల నుండి వచ్చే గాలి కాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికే గ్రామంలో చాలామంది అనారోగ్యం భారిన పడ్డారని, ఆ కర్మాగాల నుంచి గ్రామాన్ని కాపాడాలని గ్రామస్థులు రామకృష్ణ, బసవరాజు, దుర్గప్ప, తాయప్ప, వెంకటేశులు, బసప్ప, విరూపాక్షిగౌడ తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం మండలకేంద్రంలో తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు రాతపూర్వకంగా అర్జీ ఇచ్చారు. ఈ విషయం పలుమార్లు కర్ణాటక గార యజమానులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఈ సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. అధికారులు స్పందించి తగినచర్యలు చేపట్టి ఆ కర్మాగారాల నుంచి రైతులను ఇటు ప్రజలను కాపాడాలని కోరారు.

12న ఉచిత వైద్య శిబిరం

ఉరవకొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమైరా పాలీక్లినిక్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొత్త శరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్డియాలజీ, కంటి, యూరాలజీకి సంబంధించిన పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అప్పు ఇవ్వలేదని..

● పానీపూరి బండి ధ్వంసం

పుట్లూరు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు గ్రామంలో సోమవారం రాత్రి పానీపూరి అప్పు ఇవ్వలేదని ఓ వ్యక్తి నిర్వాహకున్ని కొట్టి బండిని ధ్వంసం చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. పానిపూరీ బండి నిర్వాహకుడు కాళిదాసును అదే గ్రామానికి చెందిన రామాంజనేయులు ఒక ప్లేట్ పానీ పూరి అప్పు ఇవ్వాలని అడిగాడు. దానికి కాళిదాసు ఒప్పుకోలేదు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఆగ్రహానికి గురైన రామాంజనేయులు పానీపూరి బండి అద్దాలు పగలగొట్టి, నిర్వాహకుడిపై దాడిచేశాడు. విషయం తెలుసుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వేల్పుమడుగులో పొలం పిలుస్తోంది

విడపనకల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో సోమవార వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పప్పుశనగ పంటకు పచ్చపురుగు అధికంగా సోకుతుందని, దాని నివారణకు రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. అదే విధంగా వేరుశనగ పంటను ఆకుమచ్చ తెగులు నుంచి కాపాడుకోవాలన్నారు. ఏఓ హెచ్ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల డుమ్మా..

శెట్టూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రతి సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి మండలంలో స్పందన కరువైందని మండల ప్రజలు వాపోతున్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, అటవీశాఖ అధికారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తప్ప మిగతా ఏ ఒక్క అధికారి హాజరు కాలేదు. ప్రజలు మాత్రం ఆయా సమస్యల మీద ఆ అధికారులను కలవాల్సి వస్తే ఎవరి వద్దకు వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమానికి అన్ని శాఖలు అధికారులు తప్పక వచ్చేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


వరండాలో కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు


ఆరుబయట మధ్యాహ్న భోజనాన్ని వండుతున్న దృశ్యం


టెంకాయ పట్టలతో ఏర్పాటు చేసుకున్న మరుగుదొడ్డి

ఇంకెన్నాళ్లీ.. అవస్థలు?

● మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సమస్యల తిష్ట

● ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బెళుగుప్ప, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పలు సమస్యలు తిష్ట వేశాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా తరగతి గదుల్లో బెంచీలు, ఇతరత్రా సామగ్రిని స్టోర్ చేశారు. దీంతో విద్యార్థులు వరండాలో కూర్చొని చదువుకోవాల్సి వస్తోంది. వంట గది లేకపోవడంతో మధ్యాహ్న భోజనాన్ని చెట్టుకిందన వండాల్సి వస్తోంది. ఇక మరుగుదొడ్లు అసలే లేవు. ప్రహరీ కూడా లేకపోవడంతో పందులు, కుక్కలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. ఇన్ని సమస్యలు పాఠశాలలో నెలకొని ఉన్నా.. పట్టించుకునేవారే కరువయ్యారు. నాడు నేడుతో పాఠశాల రూపురేఖలే మారుస్తామని గత వైసీపీ ప్రభుత్వం చెప్పిన గొప్పలు కేవలం ప్రచారానికే పరిమితమయ్యాయి. నాడునేడు కింద రూ. 15.40 లక్షలు మంజూరు కాగా ఆ నిధులు ఎందుకు వెచ్చించారో తెలియదు. ప్రస్తుతం రూ. లక్ష మాత్రమే డబ్బు మిగిలి ఉందని, సదరు కాంట్రాక్టర్ అందుబాటులో లేడని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాఠశాలలో 70 మంది విద్యార్థులుండగా అందులో 30 మంది బాలికలున్నారు. వీరితో పాటు ఇద్దరు మహిళా టీచర్లు ఉన్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో వారు కాలకృత్యాలు తీర్చుకోవడానికి టెంకాయ పట్టలతో చిన్న పాకను ఏర్పాటు చేసుకున్నారు. ఇంకా ఎన్నాళ్ల ఈ అవస్థలు పడాలంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు మధ్యాహ్నభోజన నిర్వాహకులు, కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలి



నాడు నేడును ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం మన బడి మన భవిష్యత్తు అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పుడు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలి. నిధులు మంజూరు కాగానే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

- మల్లారెడ్డి, ఎంఈఓ

మెయిల్ సర్వీస్‌ను తరలించరాదు


రిలే దీక్షలో పాల్గొన్న ఆర్ఎంఎస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 60 ఏళ్ల చరిత్ర కలిగిన రైల్వే మెయిల్ సర్వీస్‌ను ఇతర ప్రాంతాలకు తరలించకూడదని కోరుతూ ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ నాయకులు సోమవారం రిలే దీక్షను చేపట్టారు. పట్టణంలోని మోదీనబాదులో గల రైల్వే మెయిల్ సర్వీస్ కార్యాలయం వద్ద ఈ దీక్ష చేపట్టారు. దీక్షలో ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి చక్రపాణి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్రసహాయ కార్యదర్శి కదిర్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వాలు రైల్వే మెయిల్ సర్వీస్‌ను ఇతర ప్రాంతాకు తరలించే ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. ఆర్ఎంఎస్ ఇక్కడేకొనసాగించే వరకు పోరాటాలు విరమించేదిలేదన్నారు. పోస్టల్ పెన్షన్ అ సోసియేషన్ రాష్ట్రకార్యదర్శి పీవీ రావు, సీపీఎం నాయకులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, జగ్గలిరమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల్ని పరిష్కరించాలి: ఎస్టీయూ

కుందుర్పి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవన్న తెలిపారు. మండలకేంద్రంలోనిప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఎస్టీయూ అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాయచోటిలో విద్యార్థులు ఉపాధ్యాయుడిపై దాడి చేయడం బాధాకరమన్నారు. దీనికి కారకులైన వారిని శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ క్రిష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి చెన్నరాయప్ప, గౌరవాధ్యక్షులు నారాయణప్ప, జయరాములు, శివలింగప్ప, హనుమంతప్ప, కృష్ణమూర్తి, మల్లికార్జున, మంజునాథ, గురుస్వామి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

బ్రహ్మసముద్రం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విభిన్న ప్రతిభావంతులు తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో నందకిషోర్, జెడ్పీటీసీ ప్రభావతమ్మ, ఎంఈవో ఓబుళపతి, ఆర్ఐ నాగిరెడ్డి హాజరయ్యారు.


ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం సురక్షితం

బొమ్మనహాళ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం సురక్షితమని శ్రీధరఘట్ట వైద్యాధికారి డాక్టర్ కుమార్ రాజు అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధానమంత్రి మాతృత్వ యోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆకుకూరలు, పండ్లు, పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వినియోగించాలని, ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యసిబ్బంది శివప్రసాద్, విజయభారతి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

గుత్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలో చెట్నేపల్లిలో మస్తాన్‌వలి అనే వ్యక్తి ఇంట్లో సోమవారం మధ్యాహ్నం పట్టపగలు గుర్తుతెలియని దుండగులు చోరీకి చొరబడి మూడు తులాల బంగారు నగలు అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మస్తాన్‌వలి కార్పెంటర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనేపథ్యంలో పని నిమిత్తం ఇంటికి తాళం వేసి కుటుంబసమేతంగా బయటకు వెళ్లారు. గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాను తెరచి అందులో ఉన్న రెండు తులాల నెక్లెస్, తులం బంగారు చైన్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అదానీ కంపెనీలపై విచారణ చేపట్టాలి: సీపీఐ


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పెద్దవడుగూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అవినీతి పట్ల అదానీ గ్రూప్ కంపెనీలపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్ డిమాండ్‌చేశారు. మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా అదానీ కంపెనీల అవినీతికి హద్దు లేకుండా పోతోందన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై వేలకోట్ల రూపాయలు అక్రమాలు జరిగాయని తెలిపారు. తక్షణమే అవినీతిపై విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు నారాయణ, హుస్సేన్‌పీరా, రంగనాయకులు, సుధాకర్‌గౌడ్, ఓం నారాయణ, నాగేంద్ర, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బుడగ జంగాల వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి


తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ నాయకుల ధర్నా

రాయదుర్గంరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బేడబుడగ జంగాల ప్రజలకు ఇంటిస్థలాలు కేటాయించి రూ. ఐదు లక్షలతో ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కొత్రేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏ మ్మార్వో నాగరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కొత్రేష్ మాట్లాడుతూ పట్టణంలో బేడబుడగ జంగాల ప్రజలు 40 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారినా వారికి మాత్రం ఇల్లు కేటాయించలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలోమహిళా సమాఖ్య తాలూకా ప్రధాన కార్యదర్శి పార్వతి నరసింహులు, సీపీఐ మండల కార్యదర్శి దుర్గన్న బేడబుడగ జంగం ప్రజలు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

గుత్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గుత్తి ఎక్సైజ్ పరిధిలోని యాడికి మండలం చిక్కేపల్లి గ్రామంలో అనుమానితుల ఇళ్లల్లో సోమవారం తనిఖీలు చేపట్టినట్లు ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఓ ఇంట్లో భీమేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తినాటుసారా విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. 5లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. తనిఖీలో ఎస్ఐ అస్లాం బేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధరాంపురంలో రెవెన్యూ సదస్సు

బొమ్మనహాళ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధరాంపురం గ్రామంలో సోమవారం తహశీల్దార్ మునివేలు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వివిధ భూ సమస్యల పరిష్కారం కోరుతూ 12 అర్జీలు అందజేశారు. సర్వేయర్ రవితేజ, వీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.

రామసాగరంలో..

బెళుగుప్ప: మండలంలోని రామ సాగరంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యల పరిష్కారం కోరుతూ రైతులు 13 అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ షర్మిల, వీఆర్వో యర్రిస్వామి తెలిపారు. ఆర్ఐ రమాదేవి, మండల సర్వేయర్ నీలకంఠ, సచివాలయ సర్వేయర్ ఈశ్వరమ్మ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

కూడేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. 10న ఉదిరిపికొండ, 11న కొర్రకోడు, 17న ఇప్పేరు, 18న కల్లగళ్ల, 19న మరుట్ల, 20న గొట్కూరు, 21న బ్రహ్మణపల్లి, 24న కమ్మూరు, 26న జయపురం, 27 ఎంఎంహళ్లి, 28న కూడేరు, 31న తిమ్మాపురం, జనవరి 2న చోళసముద్రం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

గుత్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌కు చెందిన సుధారాణి అనే మహిళపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గత పది రోజుల క్రితం గుత్తిఆర్ఎస్‌లో సునీత, సుధారాణిల మధ్య డబ్బు విషయమై గొడవ జరిగింది. ఈ నేపధ్యంలో సుధారాణి తనను కులం పేరుతో దూషించిందని సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారించిన పోలీసులు సుధారాణిపై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ శ్రీనివాస్ విచారణ చేపట్టారు.

హెచ్చెల్సీకి గండి

● వృథాగా పోతున్న నీరు

పుట్లూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట- పుట్లూరు గ్రామాల మధ్య హెచ్చెల్సీకి సోమవారం సాయంత్రం గండిపడడంతో నీరంతా వృథాగా పోతోంది. అక్కడే ఉన్న రైతులు నీటికి అడ్డుకట్టవేయలేకపోయారు. దీంతో సుబ్బరాయసాగర్ డ్యాం దగ్గరికి వెళ్లి షెట్టర్లు దింపి నీటిని బంద్ చేశారు. ఆ గ్రామాల మధ్య తోటల వద్ద కాలువ బ్రిడ్జిపై వెళ్లడంతో ఫ్లోటింగ్ ఎక్కువైంది. దీంతో గండి పడింది. అధికారులు, రైతులు చేసేదేమిలేక సాగర్‌గేట్లు దింపి నీటిని బంద్ చేయాల్సి వచ్చింది.

14న సాగునీటి సంఘం ఎన్నికలు

బెళుగుప్ప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగాపురం, శీర్పి, గంగవరం సాగునీటి సంఘాల ఎన్నికలు ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులైన ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈవోఆర్డీ నాగేశ్వరశాస్త్రి, ఎంఈవో మల్లారెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వారు ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుందామని సూచించారు. శ్రీరంగాపురం సంఘంలో 106, శీర్పిలో 130, గంగవరంలో 136 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఈ నెల 11వ తేదీ నోటిఫికేషన్, 14న నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ ఉంటుంది వివరించారు.

ఆర్థిక సాయం

తాడిపత్రి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడాయిపల్లి గ్రామానికి చెందిన మహేంద్రబాబు, నాగేశ్వరి దంపతుల కుమారుడు రెబల్‌కుమార్ చికిత్స కోసం ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రూ.16వేలు ఆర్థిక సాయం అందించినట్లు అధ్యక్షుడు గుర్రప్ప తెలిపారు. సెమినార్ అప్లాస్టిక్ అనేమియా (రక్తస్రావం) వ్యాధితో బాధపడుతున్న రెబల్‌కుమార్‌కు పట్టణంలోని వివేకానంద హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కుటుంబ సభ్యులకు చికిత్స కోసం ఆర్థికసాయం అందించామని తెలిపారు. సంస్థ గౌరవ అధ్యక్షులు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కన్వీనర్ నారబోయిన శంకర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు హెచ్చెల్సీ నీరు


హెచ్చెల్సీ నుంచి చెరువుకు చేరుతున్న నీరు

పుట్లూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్ నుంచి పుట్లూరు చెరువుకు హెచ్చెల్సీ నీరు విడుదల చేసిన సంగతి విదితమే. దీంతో మండలకేంద్రంలోని చెరువుకు హెచ్చెల్సీ నీరు చేరుతోంది. పుట్లూరు చెరువు నిండిన అనంతరం కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులకు విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఎక్కడైనా మోటార్ల ద్వారా నీటిని తోడేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హేమాద్రి హెచ్చరించారు.

గుంతలను పూడ్చాలని వినూత్న నిరసన

గుత్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో గుంతలు పూడ్చాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల నాయకులు సోమవారం వినూత్న నిరసన తెలిపారు. ఆ గుంతల్లో మొక్కలు నాటి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గుత్తి నుంచి గుంతకల్లుకు ఈ రోడ్డు గుండా నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తున్నాయన్నారు. అయితే గుంతలు పెద్దఎత్తున పడడంతో వాహనదారులు ప్రయాణించాలంటే ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్య తెలిసినా అధికారులు గుంతలు పూడ్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు రోడ్డులో గుంతలు పూడ్చాలని కోరారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రామదాసు, అంజనప్రసాద్, రాజు, అడవిరాముడు, మల్లికార్జున, మల్లేష్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో యాడికి కాలువకు నీరు విడుదల

యాడికి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిల చొరవతో త్వరలో యాడికి కాలువకు నీరు విడుదల చేయనున్నారని టీడీపీ మండల నాయకులు తెలిపారు. యాడికి కాలువలో చేపట్టిన పిచ్చిమొక్కల తొలగింపు పనులను సోమవారం వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి సొంత నిధులతో కాలువలో పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు దాదాపు పూర్తయ్యాయని అన్నారు. త్వరలోనే యాడికి కాలువకు నీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పనుల పర్యవేక్షణలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, పరిమిచరణ్, నాగమునిరెడ్డి, అమిలినేని సత్య, రవికుమార్‌రెడ్డి, శ్రీహరి, ఆర్పీ సుధాకర్, లక్ష్మణ్, ఆదినారాయణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో గల 44వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన బాలప్రకాష్, దివ్య దంపతులు తమ కుమారుడు వివాన్‌తో కలిసి కారులో బెంగళూరుకు బయలుదేరారు. కాగా కరిడికొండ గ్రామశివారులోకి రాగానే కారు ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో బాలుడు వివాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరికి తీవ్రగాయాలు..

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జెండా వీధికి చెందిన మహమ్మద్ హనీఫ్, అమృత్‌లు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ సంఘటనలో ఆ ఇద్దరు గాయపడగా చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బస్సు సర్వీసులు పెంచండి

● ఆర్టీసీ ఎండీకి విప్ కాలవ వినతి


ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం ఇస్తున్న కాలవ

రాయదుర్గం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సరిహద్దులోని రాయదుర్గం నియోజకవర్గం నుంచి ఆర్టీసీ సర్వీసుల సంఖ్య పెంచాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు విన్నవించారు. విజయవాడలో సోమవారం సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయంలో డీజీపీని కలిసి వినతిపత్రం అందజేశారు. రాయదుర్గం కర్ణాటక సరిహద్దులో ఉన్నందున, ఇక్కడి నుంచి ఎక్కువ మంది ప్రయాణికులు పక్క రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళుతుంటారన్నారు. అయితే గతంలో ఉన్న పలు సర్వీసులను ఇటీవల రద్దు చేసిన కారణంగా చాలా మంది ప్రయాణికులు తీవ్ర అసౌకర్యాలకు లోనవుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో రద్దు చేసిన సర్వీసులను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. అలాగే నెల్లూరు, నంద్యాల, ఒంగోలు పట్టణాలకు ప్రతి రోజూ సాయంత్రం వేళల్లో సర్వీసులు నడపాలన్నారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాలకు నేటికీ బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వారి కోసం ప్రతి గ్రామానికి బస్సు సర్వీసు నడిచేలా చర్యలు తీసుకోవాలని కాలవ విజ్ఞప్తి చేశారు.

రైతులపై భాష్పవాయువు ప్రయోగం దారుణం

తాడిపత్రి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): మద్దతుధర ప్రకటించాలని పంజాబ్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో రైతులు భాష్పవాయువు ప్రయోగించడం దారుణమని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీసర్కిల్ వద్ద సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశంలో కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న అవినీతి అక్రమాలపై ప్రతిపక్షం ప్రశ్నిస్తే సమాధానం కూడా చెప్పలేకపోయిందన్నారు. అదాని అక్రమాలకు కేంద్రప్రభుత్వం కొమ్ము కాస్తోందని తెలిపారు. మణిపూర్ రాష్ట్రంలో అత్యాచారాలు, హత్యలు ఎక్కువ కావడంతో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతద్వేషాలు నెలకొల్పుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజావ్యతిరేక నిర్ణయాలు మానుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రామాంజనేయులు, సాలెవేముల సూరి, నాగేంద్ర, ఏఐటీయూసీ నాయకులు ఉమాగౌడ్, రవికుమార్, రమణ, రామకృష్ణ, నాగేష్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

పెద్దపప్పూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం సమీపాన గల అశ్వత్థ నారాయణస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే మాఘమాసంలో ఇక్కడ నిర్వహించే తిరుణాలలో భక్తులకు ఎటువంటి సమస్యలు వాటిల్లకుండా చూడాలని కోరారు. ప్రత్యేక క్యూలైన్‌లు, స్నానవాటికలు, ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ బీసీ రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆలయ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్